విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

బుధవారం 07 మే 2025 8 పేజీలు

పంటలను పరిశీలించని అధికారులు

- నష్టపరిహారం చెల్లింపు ఎలా సాధ్యం
- ముఖ్యమంత్రిని ప్రశ్నించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర-తాడేపల్లి : రాష్ట్ర వ్యాప్తంగా ఈదురుగాలులు, వడగండ్ల వాన ఫలితంగా పశ్చిమగోదావరి, నంద్యాల, కాకినాడ, సత్యసాయి, కృష్ణ, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లా, తిరుపతిలలో సుమారు 15 వేల ఎకరాల్లో పెద్ద ఎత్తున పంట నష్టం జరిగిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కుంచనపల్లిలో దెబ్బతిన్న పంట పొలాలను సీపీఐ నేతల బృందంతో కలిసి రామకృష్ణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 వేల ఎకరాలలో వరి, మొక్కజొన్న వంటి పంటలకు నష్టం జరిగిందని, అలాగే మరో 2 వేల ఎకరాలు ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని స్వయానా ప్రభుత్వమే లెక్కలు చెప్పడం జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 24 గంటలలో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రైతులను మానవతా దృక్పథంతో ఆదుకోవాలని ప్రకటన ఇచ్చారని, సాక్షాత్తు సీఎం చంద్రబాబు నివాసం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో తీవ్రంగా పంటలు నష్టం జరిగితే ఏ ఒక్క అధికారి కూడా రాకపోవడం, ఇప్పటివరకు పంటలను పరిశీలించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అలాంటిది సాయంత్రంలోపు నష్టపరిహారం చెల్లించాలని ముఖ్యమంత్రి ప్రకటన ఇచ్చారని, అది ఎలా సాధ్యమవుతుందని అన్నారు. తాము రైతుల వద్ద తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తున్నామంటూ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెబుతున్నారని, ముఖ్యమంత్రి, మంత్రులు చెబుతున్న మాటలకు కింది స్థాయిలో జరుగుతున్న పనులకు ఎటువంటి -మిగతా 2 లో ...

ఆర్‌డబ్ల్యుఎస్ కాంట్రాక్టు కార్మికులకు తక్షణమే
వేతన బకాయిలు చెల్లించాలి

- కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్న 'వెల్కో ఇన్‌ఫ్రా టెక్'
- మూడేళ్లుగా వేతనాలు లేక పస్తులుంటున్న కార్మికులు
- సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: పంచాయితీరాజ్ గ్రామీణ రక్షిత మంచినీటి పథకం మైలవరం పైలెట్ ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వెల్కోఇన్‌ఫ్రా టెక్ కంపెనీ వేతనాలు ఇవ్వకుండా కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతోంది. పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వండి అడిగితే సంబంధితశాఖ నుంచి తమకు బిల్లులు ఇవ్వటంలేదని సాకులు చెబుతూ సదరు కంపెనీ పలు ఇబ్బందులకు గురిచేస్తోంది. నిబంధనలు మేరకు వేతనాలు చెల్లించడంలో కంపెనీ పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కార్మికుల కుటుంబాలు రోడ్డునపడే పరిస్థితి వచ్చింది. మూడేళ్లుగా పేరుకుపోయిన వేతన బకాయిలు ఇవ్వకుండా తమ పొట్టకొడుతోందని ప్రభుత్వం స్పందించి తమ ఆదుకోవాలని కార్మికులు కోరుతున్నారు. వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని ఆర్‌డబ్ల్యుఎస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఇబ్రహీంపట్నం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలు వెల్కోఇన్‌ఫ్రాటెక్ కంపెనీ మేనేజ్‌మెంట్ కార్మికులకు వేతనాలు సక్రమంగా -మిగతా 2 లో ...

వినుకొండలో పెనుగొండకు
అపూర్వ స్వాగతం

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ దంపతులకు స్థానిక జాషువా కళా ప్రాంగణం ఆవరణలో సోమవారం రాత్రి గొప్ప సన్మాన కార్యక్రమం నిర్వహించారు. తొలుతగా పెనుగొండను కారులో ఊరేగింపుగా నరసరావుపేట రోడ్డు నుండి శివయ్య స్థూపం సెంటర్ సీపీఐ కార్యాలయం వద్దకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పెనుగొండ పులుపుల శివయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే -మిగతా 2 లో ...

తాగునీటి సమస్యకు పరిష్కారం

మాచవరంలో నూతనంగా రిజర్వాయర్.. మంత్రి కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత మిగిలిన పనులను పూర్తిచేసి నగర ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చామని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో 14 ప్రాంతాల్లో రిజర్వాయర్లను ఏర్పాటు చేసుకున్నామని, అవసరం మేరకు రిజర్వాయర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 200 ఎకరాల్లో ఏర్పాటు చేసిన తరకటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును టిడిపి ప్రభుత్వ దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని మంత్రి గుర్తు చేశారు. అదే విధంగా నీటిని శుద్ధి చేయడానికి రూ.16 కోట్లతో నగరంలో ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని, వేసవి దృష్ట్యా నీటి సమస్య తలెత్తకుండా వెయ్యి హార్స్ పవర్ మోటార్లను పెట్టి -మిగతా 2 లో ...

ఉపాధి హామితో ఆర్థిక భరోసా

- ఏడాదికి 80 లక్షల పని దినాలు లక్ష్యం
- కనీస వేతనం రూ.307
- ఉపాధి హామీ పనులను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ లక్ష్మీశ

విశాలాంధ్ర-విజయవాడ(కంచికచర్ల) : జాతీయ ఉపాధి హామి పథకం ద్వారా పని కోరిన శ్రామికులకు ఈ ఏడాది జిల్లాలో 80 లక్షల పనిదినాలను కల్పించాలనే లక్ష్యాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, శ్రామికులకు రూ.307 కనీస వేతనం కల్పించి ఆర్థిక ఊతం ఇవ్వాలని మూడు వేల పంట కుంటల తో పాటు నాలుగు వేల ఎకరాలలో ఉద్యాన పంటల పనులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం ద్వారా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధి హామి పనులను -మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

పంటలను పరిశీలించని అధికారులు

పొంతన లేదని అన్నారు. ఎన్నికల్లో రైతులందరూ చంద్రబాబు నాయుడుకు మద్దతు తెలిపి ఓట్లు వేశారని, కానీ అధికారం చేపట్టిన ఈ పది నెలల కాలంలో కూటమి ప్రభుత్వం రైతులకు ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు అన్నదాత సుఖీభవ అనే పథకం ఇప్పటివరకు అమలు చేయలేదని, డబ్బులు రైతుల ఖాతాలో వేయలేదని అన్నారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి పంట నష్టపోయిన ప్రాంతాలకు అధికారులను పంపించి వంట నష్టాన్ని అంచనా వేయించి నష్టపరిహారం వెంటనే చెల్లించాలని కోరారు. ఉద్యానవన పంటలు వేయాలంటే రైతులు ఎకరాకు రూ.1 లక్ష వరకు పెట్టుబడి పెడుతున్నారని, అంత పెట్టుబడి పెట్టి పండించిన పంటలు నష్టపోయిన తరుణంలో నష్టపరిహారం వెంటనే చెల్లించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని అన్నారు. ముఖ్యంగా వీరిలో కౌలు రైతులు చాలా మంది ఉన్నారని, వారు భూమికి కౌలు కట్టి పంటలు పండించేందుకు పెట్టుబడి పెడితే ఆఖరికి గాలి వాన వచ్చి వారికి తీవ్ర నష్టం మిగిలించాయని అన్నారు. మే 2న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజధానిలో పెద్ద ఈవెంట్ ఏర్పాటు చేసి ప్రధానమంత్రిని పిలిచారని, ప్రధానమంత్రి వచ్చినప్పుడు చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ అందరూ ప్రధాని మోదీని పొగిడారు. ఇంతమంది పొగిడిన తర్వాత కూడా మానవతా దృక్పథంతో మనిషి అనే వారు ఎవరైనా స్పందిస్తారని, కానీ ప్రధాని మోదీ స్పందించలేదన్నారు. ప్రధానమంత్రి మొదటిసారి వచ్చినప్పుడు ముంత మట్టి, చెంబు నీరు తీసుకొచ్చారని, ఈసారి చాక్లెట్ ఏదో తీసుకొచ్చారని నోరు తీయగా ఉంటుందని చెప్పి వెళ్లారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శులు కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శులు తుడిమెల్ల వెంకటయ్య, ముసునూర్ సుహాస్, గుంటక సాంబిరెడ్డి, జవ్వాది సాంబశివరావు, కూరపాటి సింగయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యుఎస్ కాంట్రాక్టు కార్మికులకు తక్షణమే వేతన బకాయిలు చెల్లించాలి

ఇవ్వకుండా తీవ్రమైన ఇబ్బందులకు గురి చేస్తోందని తెలిపారు. వేతనాలు అడిగినప్పుడల్లా డిపార్టుమెంట్ నుంచి రావాల్సిన బిల్లు ఇవ్వనందున వేతనాలు ఇవ్వలేకపోతున్నామని సాకులు చెబుతూ జాప్యం చేస్తూ కార్మికులను పలు ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నిబంధనలు మేరకు బిల్లులతో సంబంధం లేకుండా వేతనాలు ఇవ్వాలని గుర్తించకపోవడం సరికాదన్నారు. చాలీచాలనీ వేతనాలు కూడా సకాలంలో ఇవ్వకుండ నెలల తరబడి బాకాయిలు పెట్టడం అమానుషమని విమర్శించారు. కంపెనీ ప్రతినిధి పనులు నిర్వహణ సమయంలో దగ్గర ఉండి పనిచేయించాలి, కానీ కాంట్రాక్టర్ కంపెనీకి సంబంధించిన ఎవరు అందుబాటులో ఉండరని అన్నారు. ప్రజలకు త్రాగునీరు అందించడమే తమ బాధ్యతగా రేయింబవళ్ళు శ్రమిస్తున్న కార్మికులను , వారి కుటుంబాలను పస్తులు పెట్టడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా జాప్యం చేయకుండా బకాయిలు అన్ని రకాల వేతనాలను తక్షణమే చెల్లించాలని, లేని పక్షంలో ఉద్యమ కార్యాచరణకు కార్మికులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. యూనియన్ నాయకులు జి రాము, శ్రీమన్నారాయణ, యన్ వి కృష్ణ, షేక్ సుభానీ, శీతయ్య, తదితర కార్మికులు పాల్గొన్నారు.

వినుకొండలో పెనుగొండకు అపూర్వ స్వాగతం

గంగినేని వెంకటేశ్వం రావు, పఠాన్ కాసింఖాన్, గుర్రం జాషువా, వీరిశెట్టి సీతయ్య, బిక్కి రాములు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే పెనుగొండ పాత జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకుంటూ ఊరేగింపులో పలువురుని పలకరిస్తూ అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి లంకా గోవిందరాజులు కోరారు.జాతీయ మహాసభలు జయప్రదం కోరుతూ మంగళవారం విజయవాడ తారా పేటలో షాప్ లు తిరిగి ప్రచారం నిర్వహించి మాస్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా లంకా గోవిందరాజులు మాట్లాడుతూ యువత ను అన్ని రకాలుగా మోసం చేస్తున్న పాలకులపై ఉద్యమించడానికి ఈ మహాసభలు వేదిక కానున్నాయని వారు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అందరికీ నైపుణ్యం కలిగినటువంటి విద్యా మెరుగైన వైద్యం ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం ఏఐవైఎఫ్ పోరాడుతుందని తెలిపారు. మే 15 నుంచి 18 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి లో నాలుగు రోజుల పాటు జరగనున్నాయని, ఈ మహాసభలకు వివిధ దేశాలు, వివిధ రాష్ట్రాల నుండి ప్రతినిధులు హాజరుకానున్నట్లు,ఈ మహాసభల్లో ఆయా రాష్ట్రాలలో యువజన రంగంపై పాలకులు అనుసరిస్తున్న విధానాలపై నిర్దిష్టమైన చర్చలు ఉంటాయని, అనంతరం తీర్మానాల ద్వారా భవిష్యత్తు పోరాటాలకు పిలుపునిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర సహాయ కార్యదర్శి శింగం శెట్టి మోహన్ ప్రసాద్, గంటా మమత, షైనీ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ట్యాంకును నింపామని, బందరు పట్టణంతో పాటు బందరు మండలం, పెడనకు రాబోయే రెండు నెలలకు మంచినీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. నగరంలోని మాచవరం రెండవ డివిజన్‌లో 500 కిలోలీటర్ల సామర్థ్యం గల ఎలివేటెడ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్‌ను దాదాపు రూ.2.68 కోట్లతో మంగళవారం రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ ఇతర నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు. కూటమి నాయకులు మాదివాడ రాము తదితర నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామితో ఆర్థిక భరోసా

మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనీఖీ చేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి సమీపంలో అమృత సరోవర్ చెరువు పనులను, కంచికచర్లలో పంట కుంట, ఫీడర్ చానల్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఉదయం మోటర్ బైక్‌పై సుడిగాలి పర్యటనతో ఉపాధి హామి పనులను పరిశీలించిన అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామి పథకం ద్వారా చేపట్టిన పనులు అత్యంత పారదర్శకత నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది శ్రామికులకు 80 లక్షల పని దినాలను కల్పించాలన్నది లక్ష్యం కాగా ఇప్పటి వరకు 25 లక్షల పని దినాలను కల్పించడం జరిగిందన్నారు. ఉపాధి హామి పనుల పరిశీలనలో కలెక్టర్ వెంట జాతీయ ఉపాధి హామి పథకం ప్రాజెక్టు డైరెక్టర్ ఎ. రాము, నందిగామ ఆర్‌డివో కె. బాలకృష్ణ, కంచికచర్ల యంపిడివో బి. లక్ష్మీకుమారి, ఏపిడి వెంకటేశ్వరరావు, ఎపివోలు ప్రమీళ, రమాదేవి, ఇంజనీరింగ్ కన్సల్‌టెంట్స్ సతీష్ చంద్ర, జనార్ధన్, ఉపాధి హామి సిబ్బంది ఉన్నారు.

లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): విజయవాడ గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని లాడ్జీల్లో పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. గవర్నర్‌పేట సీఐ నాగ మురళి తన సిబ్బందితో కలిసి లాడ్జీల్లో ఉన్న ప్రతి ఒక్కరిని తనిఖీ చేశారు. లాడ్జీల్లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాడ్జీల్లో బస చేసే వారి వద్ద సరైన ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని, అందరి వివరాలు రికార్డులో నమోదు చేయాలని సూచించారు. చట్ట విరుద్ధంగా ఎవరికీ గదులు ఇవ్వద్దన్నారు. అనుమానితుల వివరాలను వెంటనే తమకు తెలియజేయాలని సూచించారు. నిబంధనలు పాటించని వారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో గవర్నర్ పేట పోలీసులు ఉన్నారు.

బ్రేవరీస్ కార్పొరేషన్ ఎండికి సమ్మె నోటీస్

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ బ్రేవరిజర్స్ కార్పొరేషన్ ఎండి మరియు ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్ కుమార్ ఐఏఎస్ వారికి ఏఐటియుసి కార్పొరేషన్ హమాలి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మరియు ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్ వెంకటసుబ్బయ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకేశ్వరరావు, బి.శ్రీను, నాగేశ్వరరావు, రాజేష్ మే 20వ తేదీ దేశ్వాప్తంగా జరుగు సార్వత్రిక సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్మిక చట్టాలను మార్చివేసి నాలుగు లేబర్ కోడులుగా తీసుకొని వచ్చి కార్మికులకు ఎలాంటి హక్కులు లేకుండా చేస్తుందని అందుకు నిరసనగా మరియు ముఖ్యంగా ప్రభుత్వ రంగాన్ని వివిధ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆ కార్పొరేషన్ లో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులగా సంవత్సరాల తరబడి విట్టిచాకిరి చేయించుకుంటూ వారిని పర్మినెంట్ చేయకుండా వారికి కనీస వేతనాలు ఇవ్వకుండా సాగిస్తున్నందుకు నిరసనగా సమ్మె నిర్వహిస్తున్నామని ముఖ్యంగా ప్రభుత్వానికి ఆదాయం తెస్తున్న లిక్కర్ కార్పొరేషన్ లో పనిచేయు హమాలీ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా వారికి ఇచ్చే అరకొర కూలి కూడా పెంచకుండా కాలయాపన చేస్తున్నారని వారికి ఇన్సూరెన్స్ యూనిఫామ్ బోనస్ ఇలాంటి సౌకర్యాలు కల్పించాలని పనిలో నుండి రిటైర్మెంట్ అయినప్పుడు గ్రాటిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ సమస్యల పైన మే 20వ తేదీన రాష్ట్రములోని 29 లిక్కర్ డిపోలలో కార్మికులు పని బందు చేసి సమ్మెలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు పెట్టినా నిర్బంధించిన కార్మిక వర్గం చైతన్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ప్రమాదకరమైన కేబుల్, ఇంటర్నెట్ వైర్లు తొలగించండి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : కేబుల్, ఇంటర్నెట్ ఇతర వైర్లు ప్రజల భద్రతకు ప్రమాదకరంగా ఉండే పరిస్థితి కనిపిస్తే వాటిని వెంటనే తొలగించాలని నగరపాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్ ఆదేశించారు. నగర సుందరీకరణలో భాగంగా సీసీపీ కార్పొరేషన్ కార్యాలయంలోని సీసీపీ చాంబర్‌లో మంగళవారం కేబుల్ ఆపరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరంలేని, వాడని వైర్లను క్రమబద్ధీకరించి, ఒక వారం రోజుల్లోగా తొలగించాలని అధికారులు, కేబుల్ ఆపరేటర్లను ఆదేశించారు. పౌరుల భద్రతను పరిగణలోకి తీసుకుంటూ, నగర పరిధిలో ఎక్కడైనా వేలాడుతూ ఉన్న కేబుల్, ఇంటర్నెట్ లేదా ఇతర వైర్లు, ప్రజల భద్రతకు ప్రమాదకరంగా ఉండే పరిస్థితి కనిపిస్తే, వాటిని తక్షణం తొలగించి, నగరం అందంగా ఉండేలా పునర్నిర్మించుకోవాలని ఆదేశించారు. నిబంధనకు అమలు చేయకపోతే, వారం తర్వాత నగరపాలక సంస్థ అధికారులు స్వయంగా తగిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

దోమల నివారణకు యాంటీ మలేరియా ఆపరేషన్లు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలో దోమల నివారణకు యాంటీ మలేరియా ఆపేరేషన్లు నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక 30వ డివిజన్ దేవినగర్ బుడమేరు కెనాల్, 57వ వార్డు కొత్త ఆర్‌ఆర్ పేట, బుడమేరు కాలువలో మంగళవారం ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేయటంతోపాటు 60వ వార్డు వాంబేకాలనీ కల్వర్ట్ పవర్ స్ప్రే, ఏఎల్‌వో కార్యకలాపాలు, 61వ వార్డు పాయకాపురం చెరువులో తూటుకాడ తొలిగింపు, గుర్రపుడెక్కులను బోట్ల సహాయంతో మలేరియా సిబ్బంది పరిశుభ్రపర్చినట్లు తెలిపారు. నగరపాలక సంస్థ బయాలజిస్టు సూర్యకుమార్ ఆధ్వర్యంలో మలేరియా సిబ్బంది యాంటీ లార్వా ఆపరేషన్లు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలో ఎక్కడ నీటి నిల్వలు ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీరు నిల్వ ఉంటే దోమల ఉధృతికి కారణమవుతుందని, ఎప్పటికప్పుడు యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహిస్తూ ప్రజలకు దోమ కాటు వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా అధికారులు పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవో 77ను రద్దు చేయాలి

-విద్యారంగాన్ని గాలికి వదిలేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

-ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సాయి కుమార్

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో విద్యా రంగాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పూర్తిగా గాలికి వదిలేశారని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఉపాధ్యక్షులు ఎం సాయికుమార్ విమర్శించారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో స్థానిక దాసరి భవన్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు పరచడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు.. తల్లికి వందనం పథకాన్ని అమలుపరిచారా...? జీవో నెంబర్ 77 రద్దుచేసి పీజీ విద్యార్థులకు న్యాయం చేస్తానన్నారు చేశారా...? జీవో నెంబర్ 107, 108 రద్దు చేసి ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కార్పొరేట్ చేతుల్లో పెట్టారు.. ఎక్కడ ఏ విద్యార్థికి సమస్య వచ్చిన మా ప్రభుత్వం వెంటనే స్పందించి వారి యొక్క సమస్యలను పరిష్కారం చేస్తాము అదేవిధంగా పేద మధ్యతరగతి విద్యార్థులకు అందరికీ ఉచిత విద్య మెరుగైన సదుపాయాలు అందిస్తామని అన్నారు కానీ అవి మాటలకే పరిమితం అయ్యాయి కానీ ఎక్కడ కూడా అమలులో పూర్తిగా విఫలం ఎన్డీఏ కోటమి ప్రభుత్వం విఫలం చెందింది. ఈ మధ్యకాలంలో జేఈఈ మెయిన్స్ ఫలితాలు దేశవ్యాప్తంగా విడుదల ఎన్టీఏ విడుదల చేసింది. నారాయణ విద్యా సంస్థలు మా కళాశాలలో చదివిన విద్యార్థులకు ర్యాంకులు వచ్చాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని వారు చేసినటువంటి తప్పుడు ప్రచారాన్ని ఏ విధంగా విద్యార్థులను వారి తల్లిదండ్రులను నమ్మించి మోసం చేస్తున్నారో వాటిని కళ్లకు కట్టినట్లు ఆధారాలతో సహా బయట పెట్టినప్పటికీ ఇప్పటివరకు కూడా అటు నారాయణ విద్యాసంస్థలు అధిపతి నారాయణ గాని మరి ముఖ్యంగా విద్యాశాఖ మంత్రి అయితే పట్టించుకోకుండా వివరిస్తున్నారు. అంటే నారా లోకేష్ ,నారాయణకు కొమ్ము కాస్తూ ఉన్నటువంటి ప్రభుత్వ విద్యను మొత్తం కూడా పేద మధ్యతరగతి విద్యార్థులకు దూరం చేస్తూ రాష్ట్ర మొత్తం కూడా పుట్టగొడుగుల్లాగా నారాయణ విద్యాసంస్థలను పెంచి పోషించేందుకు వత్తాసు పలుకుతున్నారు. సెలవు దినాల్లో కూడా సెలవులు ఇవ్వకుండా విద్యాశాఖ అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను తుంగలో తొక్కి తరగతులు నిర్వహిస్తున్నారు కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతూ ఉన్నారువెంటనే వారికి సెలవులు ప్రకటించాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేస్తున్నాము. ఇప్పటికైనా నారా లోకేష్ స్పందించి కార్పొరేట్ కళాశాలలో జరుగుతున్న అక్రమాలను అడ్డుకోకపోతే విద్యాశాఖ మంత్రి అయ్యుండి రానున్న రోజుల్లో ఏఐఎస్ఎఫ్ ప్రత్యక్ష ఆందోళనలు కళాశాలల వద్ద చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధిక్ బాబు, విజయవాడ నగర అధ్యక్ష కార్యదర్శులు ఎస్ రంజిత్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

20న ఏఐటీయూసీ తిరువూరు పట్టణ మహాసభ జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-తిరువూరు: ఈనెల 20వ తేదీన ఏఐటీయూసీ తిరువూరు పట్టణ 2 మహాసభ జరుగుతుందని ఈ మహాసభలో జిల్లా నాయకులు నియోజకవర్గ నాయకులు పాల్గొంటారని, సభ్యులందరూ సకాలంలో మహాసభలో పాల్గొనాలని సీపీఐ పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్ పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ తిరువూరు ఆటో యూనియన్ శాఖ మహాసభ మంగళవారం సీపీఐ సుంకర వీరభద్రరావుభవన్‌లో పల్లపు మురళి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కె నాగుల్‌మీరా పాల్గొన్నారు. ఈ సభలో ఉదయ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం 2025 భారత కమ్యూనిస్టు పార్టీ గ్రామ శాఖల మహాసభల నుండి ఆలిండియా మహాసభ వరకు జరుగుతున్న నేపథ్యంలో ఈ శాఖ మహా సభ ఏర్పాటు చేసినట్లు, ఈ సభలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన డీజిల్ రేట్లకు వ్యతిరేకంగా అనేక కార్యక్రమాలు ర్యాలీలు చేశామని, అలాగే భవిష్యత్తులో చేస్తామని అన్నారు. ఆటో వర్కర్ యూనియన్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆటో వర్కర్స్ యూనియన్ శాఖ కార్యదర్శిగా ఎస్‌కె హసన్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సుభాని ఆటో యూనియన్‌శాఖ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆటో.. ఇద్దరికి గాయాలు

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం ఆగిరిపల్లి రోడ్‌లో ట్రాక్టర్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదురుగా ఆగి ఉన్న ట్రాక్టర్‌ను సోమవారం రాత్రి ఆటో ఢీకొట్టింది. ఆటోలో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గగుడి ఈవోగా శీనా నాయక్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రాష్ట్రంలో రెండో అతి పెద్ద దేవస్థానంగా ఉన్న విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం స్వామి ఈవోగా వీకే.శీనా నాయక్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆయన ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్ మెంట్ బోర్డ్ మెంబర్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తూ డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న ఆయనకు మత్స్యశాఖ రెవెన్యూకు బదిలీ చేశారు. అక్కడి నుంచి దుర్గగుడి ఈవోగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళ వారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు దుర్గగుడికి ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలను దేవాదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ కే.రామచంద్రమోహన్ నిర్వహించారు. ఆదేశాలతో వీకే.శీనానాయక్ బాధ్యతలు చేపట్టనున్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర-విజయవాడ(క్రైం): యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం విజయవాడ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. చిట్టినగర్‌కు చెందిన గణపతి(24) ఆర్అండ్‌బీ డిపార్ట్ మెంట్‌లో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులతో కలిసి నివాసముంటు న్నాడు. తల్లిదండ్రులు బయట పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు ఇంటికి వచ్చే సరికి ఉరేసుకుని వెళలాడుతూ కనిపించాడు. వెంటనే స్థానికులు సహాయంతో కిందకు దింపారు. అప్పటికే గణపతి మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకుని టూటౌన్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిషోర్ వికాసం పై అవగాహన

విశాలాంధ్ర-ఘంటసాల: అంగనవాడి కేంద్రంలో కిషోర్ బాలికలకు బాల్యవివాహాలు, రక్త హీనత పర్సనల్ హైజీన గుడ్ టచ్ బాడ్ టచ్, బాల్యవివాహాలు అరికట్టి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తల్లులు బాలింతలకు అవగాహన కల్పించడం జరిగినది. బాలికలకు 18 సం౹౹లు నిండిన తరువాత మాత్రమే వివాహం చేయాలని తెలిపారు. ఏఎన్ఎం సునీత ఆషా కార్యకర్త జి. కమల కుమారి, అంగనవాడి కార్యకర్తలు కె. కనక దుర్గ ఎన్. మానస, ఎం ఉమాదేవి కిషోర్ బాలికల, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

రైతులే పంట కాలువ పూడికతీత

విశాలాంధ్ర-చల్లపల్లి : సాగునీటి సరఫరా సరిగాలేని పంట కాలువను రైతులే స్వచ్ఛందంగా ముందుకువచ్చి పూడికతీత పనులు చేపట్టారు. 9వ నెంబరు పంట కాలువ నుంచి పాగోలు ఆయకట్టుకు సాగునీటి సరఫరా కోసం రైతులు జేసీబీ సహాయంతో మంగళవారం పూడికతీత పనులు చేశారు. కాలువ పూడుకుపోయి ఉండటం, గత కొన్నాళ్లుగా తవ్వకం పనులు చేపట్టకపోవటంతో స్వచ్ఛంధంగా ముందుకువచ్చి సొంత ఖర్చులతో పనులు చేయించుకున్నట్లు రైతులు తెలిపారు. పాగోలు ఎంపీటీసీ మేకా సత్యనారాయణప్రసాద్(బంగారుబాబు), కె. కొత్తపాలెం నీటిసంఘం వైస్‌ఛైర్మన్ మేకా శివప్రసాద్, రైతులు మట్టా కమలాకరరావు, నరేష్, దిరిశం ప్రకాశరావు, గూడవల్లి జయరాజు పనులు పర్యవేక్షించారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : మంత్రి నారా లోకేష్

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో నిరాదరణకు గురవుతున్న గ్రంథాలయాల అభివృద్ధికి , మాతృ బాషా వికాసానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర విద్యా, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ప్రతినిధులు ఆయనను కలిశారు. నగరంలో ఇటీవల రాష్ట్ర వ్యాపితంగా ఆ నిర్వహించిన కార్యక్రమాల్ని రాష్ట్ర సదస్సు చేసిన తీర్మానాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. గతంలో మాదిరిగా పుస్తక మహోత్సవాన్ని ఎన్టీఆర్ ట్రస్టు తో కలిసి జరపాలని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో నూతన పుస్తకాలు కొనుగోలు ఉద్యోగాల భర్తీ, విద్యా సంస్థల్లో గ్రంథాలయాల అభివృద్ధి వంటి వాటి పై కసరత్తు చేస్తున్నామని, సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే సమస్యల్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. లోకేష్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చిన వారిలో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివప్రసాద్, బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు లక్ష్మయ్య ప్రతినిధులు వెంకటనారాయణ, గోళ్ళ నారాయణ ఉన్నారు.

ప్రైవేటు పాఠశాల పిల్లలు ప్రభుత్వ బడిలోకి



విశాలాంధ్ర-చల్లపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలంటూ జాతీయ ఉత్తమఉపా ధ్యాయుడు, నారాయణరావునగర్ మోడల్ పాఠశాల హెచ్ఎం కైతేపల్లి దాస్ చేపట్టిన ఇంటింటి ప్రచారం సత్ఫలితాలను ఇస్తోంది. మంగళవారం పాఠశాల ఉపాధ్యాయిని లతో కలిసి కాలనీలో ప్రచారం చేపట్టారు. పదవ తరగతిలో ఇటీవల అత్యధిక మార్కులు సాధించిన పాఠశాల పూర్వవిద్యార్థిని బ్యూలా పాలవెల్లి సైతం ఉపాధ్యాయులతో కలిసి ప్రచారంలో పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో వసతిసౌకర్యాలపై తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినిలు చంద్రకుమారి, విజయ దుర్గ, రాధారాణి, దుర్గాప్రసాద్, ఎస్ఎంసి చైర్మన్ సీతామహలక్ష్మిలు పాల్గొన్నారు.

డాక్యుమెంట్లు పోయినవి

కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, తాడిగడప, డోర్ నెం.8-231/10, హనుమాన్ ఎన్‌క్లేవ్, హనుమాన్ వీధి, 3వ లైను, శ్రీనివాసనగర్ కట్ట, సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజ ఎదురు కాపురస్తులు శ్రీ దంతగిరి నాగకృష్ణ సుమంత్, తండ్రి: దంతగిరి రవి మరియు శ్రీ దంతగిరి రవి, దంతగిరి (లేటు) వెంకటేశ్వరరావు గారికి సంబంధించిన దస్తావేజు నెంబర్లు: 3476/2016 మరియు 7050/2017, తేది: 03-01-2023, పటమట సెంటర్ నుండి SBI, కృష్ణలంక కు పోస్టు ద్వారా పంపిన దస్తావేజులు పోయినవి. కావున సదరు దస్తావేజులు ఎవ్వరికైన దొరికిన యెడల ఈ క్రింది వారికి తెలియజేయ ప్రార్థన.

ఆథరైజ్డ్ ఆఫీసర్
భారతీయ స్టేట్ బ్యాంక్, కృష్ణలంక బ్రాంచ్

మహారాజశ్రీ మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారికోర్టు విజయవాడ

OS.NO. 1399/2023

Between:
Union Bank of India, Labbipet Branch, Vijayawada..... వాది.
AND
M/s Intense IAS Institute, Vijayawada and Others..... ప్రతివాది.
To.
1) M/s Intense IAS Institute, Vijayawada. Represented by its Managing Partners 1. Madamanchi Ramakrishna and 2. Putta Ratna Kumari
2). Madamanchi Ramakrishna, S/o. Srinivasa Rao, Managing Partner M/s. Intense IAS Institute, Vijayawada.
3). Putta Ratna Kumari, Managing Partner M/s Intense IAS Institute, Vijayawada.

పై నెంబరు గల దావాలో ప్రతివాదులు అయిన మీరు 1 టూ 3 నోటీసు నిమిత్తం ది.15-05-2025వ తేదిన పై కోర్టు వారు వాయిదా వేసినారు కావున సదరు తేదిన మీరు గాని మీ తరపున ప్లీడరు గారు గాని పైన తెలిపిన కోర్టు వారి ఎదుట ది.15-05-2025వ తేది ఉదయం 10.30 ని.లకు పై కోర్టు లో హాజరై తగిన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున పై నెంబరు దావాలో విచారించగలరని. ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(By Order of the above Court)

ఇట్లు
యం.డి ప్రభాకర్, M.Com, LL.M., న్యాయవాది,
డి.నెం.31-16-30, బుల్లెమ్మ వీధి, మాచవరం,
విజయవాడ-520004. ఫోన్: 9290055959.
email: advdurgaprabhakar@gmail.com

23న సీపీఐ తిరువూరు నియోజకవర్గ మహాసభ

జయప్రదం చేయండి : తూము కృష్ణయ్య

విశాలాంధ్ర-తిరువూరు: ఈ 23వ తేదీన జరగబోయే తిరువూరు నియోజకవర్గ మహాసభను జయప్రదం చేయాలని, ప్రతి ఒక్క వ్యక్తి ఒక శక్తి లా మారి మన పార్టీ పురోగతికి పనిచేయాలని సమావేశానికి వందల సంఖ్యలో జన సమీకరణ చేయాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య పిలుపునిచ్చారు. సీపీఐ తిరువూరు నగర కమిటీ సమావేశాన్ని సుంకర వీరభద్రరావు భవనంలో సీపీఐ కార్యాలయంలో పట్టణ సహాయ కార్యదర్శి షేక్ సుభాని అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య, నియోజకవర్గ కార్యదర్శి ఎస్.కె నాగుల్ మీరా, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్ మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో జరగబోయే మహాసభల గురించి చర్చించారు. ఈ నెల 11న గంపలగూడెం మండల కమిటీ సమావేశం, 14న విస్సన్నపేట మండల కమిటీ సమావేశం, 19న ఏ కొండూరు మండల కమిటీ సమావేశం, 20న తిరువూరు మండల కమిటీ సమావేశం 23న నియోజకవర్గ మహాసభ జరుగుతుందని, అలాగే నియోజకవర్గ మహాసభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ రానున్నట్లు కమిటీ సమావేశంలో తెలిపారు. ఈ మహాసభలకు ప్రతి ఒక్కరూ హాజరై మండల సమావేశాల్లో మండల వారీగా అందరూ హాజరై వాళ్ళ నిర్ణయాలను తెలియజేయాలని అన్నారు. ఈ సమావేశంలో పట్టణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు పరిశీలించిన కలెక్టర్ లక్ష్మీశ

విశాలాంధ్ర-కంచికచర్ల : ఎన్టీఆర్ జిల్లా, కంచికచర్ల మండలం, పరిటాల గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో జరుగుతున్న పనులను జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఆర్డీవో బాలకృష్ణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో రోజుకి లక్ష మంది ఉపాధి హామీ పనుల్లో వచ్చే విధంగా టార్గెట్ పెట్టుకున్నాం.కూలీలకు రోజుకి 307 రూపాయలు వచ్చేలా కొలతలు ఇచ్చి పనులు చేపిస్తున్నామని అన్నారు.ప్రతి కూలీ కూడా 100 రోజులు పూర్తి చేసే విధంగా కృషి చేస్తాము ఈ ఉపాధి హామీ పథకం రైతులకు బాగా ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. దీనిని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని పనులలో అవకతవకలు జరగకుండా జరిగేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీ కుమారి అధికారులు ఉపాధి హామీ పథక ఏపీవో, ఫీల్డ్ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే వార్డు పర్యటనలు : ఎమ్మెల్యే రాము

విశాలాంధ్ర-గుడివాడ : నాడు సమస్యలకు నిలయమైన గుడివాడ నేడు అభివృద్ధికి నిలయంగా మారిందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం స్థానిక ఏడో వార్డులో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మీకోసం - మీ వెనిగండ్ల పర్యటన నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన పర్యటనలో డ్రైనేజీ సమస్యపై ప్రజల నుండి వచ్చిన విజ్ఞప్తుల మేరకు మున్సిపల్ అధికారులతో కలిసి వార్డులోని కొత్తపేట పరిసర ఏరియాల్లో పర్యటించారు. వార్డువ్యాప్తంగా డ్రైనేజీ సమస్యను పరిష్కరించేలా శాస్త్రీయ బద్ధంగా డ్రైనేజీ నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లుతో మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు వార్డు పర్యటనలు నిర్వహిస్తున్నామన్నారు. వార్డు పర్యటనలో తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా కృషిస్తున్నామన్నారు. ఆర్థికపరమైన సమస్యలు పరిష్కారానికి కొంత సమయం పడుతుందని, ఇతర సమస్యలను తక్షణమే పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, అసిస్టెంట్ కమిషనర్ పి శ్రీనివాసరావు, డిఇ సతీష్ చంద్ర, ఏఇ రాజేష్, నాయకులు పంద్రాజు సాంబయ్య, గద్దం ప్రకాష్‌దాస్, సయ్యద్ జబీన్ , కునుకు మోహన మురళి, తేనెల ఏడుకొండలు, మంగరాజు, చిన్నారావు, పెద్దిరాజులు, కోసూరి ఆంజనేయులు, కోసూరి అంజి పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పిల వ్యాఖ్యలకు ఖండన

విశాలాంధ్ర-పమిడిముక్కల: ఇటీవల పిహెచ్ సి లో పనిచేసే ఎంఎల్ హేచ్ పి లు తమ ఉద్యోగ భాధ్యత మరచి సిబ్బంది పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని దానిని ఖండిస్తూ నల్ల బ్యాడ్జీ లతో వీరంకిలాకు, కపిలేశ్వరపురం వైద్యశాల సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు.మంగళవారం సదరు వైద్య సిబ్బంది ఎఎన్ఎం, సూపర్వైజర్లు, ఇతర సిబ్బంది పనులు మేమే చేస్తూన్నామనటం సరికాదని ఎవరి పని వారికి ఉంటుందని వారి డిమాండ్ల ఉంటే పై అధికారులకు తెలిపి సామరస్యంగా పరిష్కరించేందుకు కృషి చేసుకోవాలని విరామసమయం లో నిరసన వ్యక్తం చేసి వారు మాట్లాడిన మాటలు ఖండిస్తున్నామని నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో డి.ఝాన్సీరాణి దేవకమలం కృష్ణ మోహన్ నాంచారమ్మ, లక్ష్మి, కృప ధరణి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర, కూచిపూడి : తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు పార్టీ అధినాయకత్వం అన్నివేళల అండగా ఉంటుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు.మొవ్వ మండలం నిడమోలు గ్రామంలో ఇటీవల మరణించిన కోట పోతురాజు కార్యకర్త కుటుంబ సభ్యులకు మంగళవారం ఐదు లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ముందు చూపుతో సభ్యత్వం ఉన్న ప్రతి కార్యకర్తకు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించడం మంచి విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో మృతుని కుటుంబ సభ్యులతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మత్స్య భవనంకు మరమతులు చేయించాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ: 2024 నవంబర్లో కృష్ణానదికి వచ్చిన ఉధృతమైన వరదలతో ధ్వంసమైన మత్స్య భవనం, ఫ్లాట్ ఫారం మరమతులు తక్షణం చేయించాలని కోరుతూ మత్స్యకార సహకార సంఘాల అధ్యక్షులు లకనం నాగాంజనే యులు, కర్రి కృష్ణమూర్తి లు మంగళవారం అవనిగడ్డ మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఆర్ ప్రతిభకు విజ్ఞాపన పత్రం అందజేశారు. సముద్రములో చేపల వేట నిషేధం ముగిసే లోపు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం క్రింద వివిధ స్కీమ్స్ కు ఎంపికైన లబ్ధిదారులకు ఆయా యూనిట్లను అందిస్తే మత్స్యకారులకు ఉపయోగ పడతాయిఅన్నారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమెను కోరారు ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు నాగిడి తాతారావు, లంకే శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

కేడీసీసీ చైర్మన్ రఘురామ్‌కు సన్మానం

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షునిగా పనిచేసిన నెట్టెం రఘురాంను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విస్సన్నపేట మండలానికి చెందిన కూటమి పార్టీలకు చెందిన నేతలు మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు. అనంతరం వేరువేరుగా శాలువాలతో సత్కరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మట్టా వేణుగోపాలరావు, నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు, నెక్కలపు శ్రీనివాసరావు(దాబా శ్రీను), కవులూరి రాజా, రాయల సుబ్బారావు, అరిగే శ్రీనివాసరావు, మాచిన అరవింద్, మర్రిబోయిన చిన్నోడు, జనసేన మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ యాసిన్, తోట కృష్ణకిశోర్, నాయకులు నందమూరి వెంకటేశ్వరరావు, అడపా శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు నిగామాను సూరిబాబు తదితరులు ఉన్నారు.

కూచిపూడికి మహర్దశ

అభివృద్ధికి రూ.5 కోట్లు : కలెక్టర్ బాలాజీ

విశాలాంధ్ర-కూచిపూడి : 2025-26 ఆర్థిక సంవత్సరంలో కూచిపూడి గ్రామాన్ని ఆర్థికంగా అభివృద్ధి ఆదాయ వనరులను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జిఎస్ఏ) కింద రూ.5 కోట్లు సమకూర్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేయటంతో అధికారులు అభివృద్ధి పనుల వివరాల సేకరణపై దృష్టి సారించారు. కలెక్టర్ డీకే బాలాజీ ఇటీవల జేసీ గీతాంజలి శర్మ, సహాయ కలెక్టర్ ఫరీద్ జైద్ లతో కలిసి జిల్లా, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. 'కూచిపూడి గ్రామం నాట్య కళ అభివృద్ధి' అంశాలపై సమీక్ష నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కూచిపూడి గ్రామ ఆర్థిక అభివృద్ధికి, ఆదాయ వనరుల పెంపుదలకు రూ.5 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ వి ఆర్‌కృష్ణ తేజ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. కూచిపూడిలో కూచిపూడి నాట్యకళకు పునర్జీవం పోయటానికి పూర్వ వైభవానికి కృషి చేయాలని కలెక్టర్ కోరారు. కేరళలోని కళా మండలం, చెన్నైఅడయార్ కళాక్షేత్రం, కర్ణాటకలోని నృత్య గ్రామం మాదిరిగా కూచిపూడిలో ఒక స్వతంత్ర సంస్థను నెలకొల్పి దాని ద్వారా అన్ని కార్యకలాపాలు శాశ్వతంగా నిర్వహించాలన్నారు. కూచిపూడిలోని గురు శిష్య పరంపరను కొనసాగే విధంగా వారసత్వ కుటుంబాలను ప్రోత్సహించాలన్నారు. వారికి అవసరమైన ఆర్థిక సహాయం అందించిచడుకోవాల్సినే ఆవశ్యకతఉందని అభిప్రాయపడ్డారు. కూచిపూడి అగ్రహారంలో వ్యక్తిత్వ వికాసం, కూచిపూడి బ్రాండింగ్, మార్కెటింగ్ చేసేందుకు ప్రణాళిక రూపొందించటానికి సమయత్తమవుతున్నట్లు వివరించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే ఐదు కోట్ల రూపాయలతో స్వయం ఉపాధి, మానవ వనరులపై అధిక ప్రాధాన్యత ఇచ్చేందుకు అవకాశాలు రెండుగా కనబడుతున్నాయి. కూచిపూడి గ్రామానికి వచ్చే ఔత్సాహికులు ఒకటి రెండు రోజులు ఆ గ్రామంలో ఉండేందుకు వీలుగా విడిది గృహాలను, సామాజిక భవనాలను గుర్తించే ప్రక్రియ చేపట్టమన్నారు. కూచిపూడి నాట్య దుస్తులను ధరించి సెల్ఫీలు నాట్యం చేసే ఫోటోలు వీడియోలు తీసుకునేందుకు, వేదికలు, ఫోటో కేంద్రాలు తదితర ఏర్పాట్లుచేయాలన్నారు. కూచిపూడి గ్రామస్తులు కూచిపూడినాట్యకళకు అవసరమైన గజ్జలు, దుస్తులు, జడలు, రోల్డ్ గోల్డ్ నగలు ఇతర వస్తువులు తయారు చేయుటకు తద్వారా వారి జీవన ప్రమాణాలు పెంపొందించుటకుతగిన చర్యలు తీసుకోవాలన్నారు. కూచిపూడి గ్రామంలో రహదారుల వెంబడి భవనాలపై కూచిపూడి నాట్య చిత్రాలతో రంగులు వేయాలన్నారు.కూచిపూడి గ్రామంలో ప్రవేశించగానే ఒక కళాత్మకమైన ఆహ్లాదకర వాతావరణం ప్రతి ఒక్కరి మదిలో మెదిలే విధంగా కూచిపూడి గ్రామం రూపుదిద్దు కోవాలనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

8వ రోజుకు వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయం నందు వేసవి విజ్ఞాన శిబిరం 8వ రోజు వేసవి విజ్ఞాన శిబిరం వైభవంగా నిర్వహించినట్లు ఆ గ్రంథాలయ అధికారులు బి.శకుంతల, పి.సత్య శిరీషలు పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరం సందర్భంగా మంగళవారం కథలు చదవడం, సొంతంగా కథలు చెప్పడం, పుస్తక పఠనం, కలరింగ్, పేపర్ క్రాఫ్ట్, జీకె, తెలుగు పద్యాలు విద్యార్థినీ, విద్యార్థులచే చెప్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 40 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్సిడీపై దాణా కట్టలు

విశాలాంధ్ర-తాడికొండ : పశుపోషకులకు 50 శాతం సబ్సిడీపై దాణా కట్టలను పంపిణీ చేస్తున్నట్లు తాడికొండ పశువైద్యాధికారి ఏరువా రాయపరెడ్డి మంగళవారం తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గానికి 25 మెట్రిక్ టన్నుల దాణా వచ్చిందన్నారు. వీటిలో తాడికొండకు 5 టన్నులు, పొన్నెకల్లుకు ఐదు టన్నులు, రావెల, ఫిరంగిపురం, నుదురుపాడుకు ఐదేసి టన్నుల చొప్పున దాణా అందుబాటులో ఉందన్నారు. రూ.1110లు విలువ చేసే దాణా కట్టలు సబ్సిడీపై రూ.555లకు 50 కేజీల బస్తా ఇవ్వటం జరుగుతుందన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేడు వృద్ధులకు ప్రత్యేక శిబిరం

విశాలాంధ్ర-పొన్నూరు : పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణంలో బుధవారం దివ్యాంగులు, వయో వృద్ధులకు ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు తెలిపారు. ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక శిబిరం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తామని దివ్యాంగులు, వయోవృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కాలజ్ఞాని వీరబ్రహ్మేంద్రస్వామి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తాను దివ్య దృష్టితో వ్రాసిన కాలజ్ఞానం ద్వారా భూత, భవిష్యత్, వర్తమానాల గురించి విశదీకరించిన సాక్షాత్ భగవత్ స్వరూపులు విరాట్ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అని ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. స్థానిక అమరావతి రోడ్డు బ్రహ్మంగారి గుడి వీధిలో కొలువైయున్న జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 332వ ఆరాధన, గురుపూజోత్సవ మహోత్సవంలో భాగంగా రెండవ రోజు జరిగిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే గల్లా మాధవి పాల్గొని పతాకావిష్కరణ గావించి వీరవల్లి బాబూరావు, రమణమ్మ దంపతులతో కలిసి విశ్వశాంతి హోమంలో మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గల్లా మాధవి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా సంక్షేమ ఫలాలు ఎదిగేలా ఆర్థిక సహకారం అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఉమ్మ డోజు నాగేశ్వరచారి, టీడీపీ అధికార ప్రతినిధి దామచర్ల శ్రీనివాసరావు, అడక శ్రీనివాసరావు యాదవ్, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పావులూరి హనుమంతరావు, మహిళా అధ్యక్షురాలు అంగల కుదుటి సుశీల, దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు కడియాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌కు ప్రముఖుల శుభాకాంక్షలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కోవెలమూడి రవీంద్ర (నాని) మేయర్ అయిన సందర్భంగా స్థానిక ఆయన ఛాంబర్‌లో ఆయనను అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జస్టి వీరాంజనేయులు, భారతీ సాంస్కృతిక సంగీత కళా వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు మిరియాల ప్రసాద రావు, సేవా సదన్ వ్యవస్థాపక అధ్యక్షులు, గుంటూరు కాపునాడు మాజీ అధ్యక్షులు మిరియాల గోపి కుమార్ మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా మేయర్‌ను శాలువ, బొకేలతో ఘనంగా సన్మానించారు. అనంతరం నగరంలోని సాంస్కృతిక విభాగానికి పెద్దపీట వేసే దిశగా అమరావతి రోడ్‌లో ఉన్న గుంటూరు అన్నదాన సమాజ ఆడిటోరియంకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని మేయర్ నానికి విజ్ఞప్తి చేశారు. కళలను ప్రోత్సహిస్తూ..పేద కళాకారులను ఆదరించి గుంటూరు నగరాన్ని కళల కాణాచిగా ప్రసిద్ధి పొందేట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పందించిన మేయర్ కళల ఆదరణకై ప్రత్యేక దృష్టిపెడతామని, అందరి సహకారంతో కల్చరల్ ప్రోగ్రాంలు మరిన్ని నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి ఉగాది పురస్కారం, దేశరత్న అవార్డును జమ్మూకాశ్మీర్ ప్రభుత్వ పర్యాటక శాఖ నుంచి యూపీ ప్రభుత్వ మంత్రి నుంచి అందుకున్న డాక్టర్ జస్టి వీరాంజనేయులుని మేయర్ రవీంద్ర శాలువాతో సన్మానించారు. మేయర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో గుంటూరు కళాకారుల ఐక్య వేదిక సభ్యులు కె.బాబూరావు, అబ్దుల్ ఖాదర్, అన్నం రమేష్, జొన్నలగడ్డ వెంకటరత్నం, కసుకుర్తి హనుమంతరావు తదితరులు ఉన్నారు.

మద్యం దుకాణం తొలగించాలని మహిళల నిరసన

విశాలాంధ్ర-మంగళగిరి : దుగ్గిరాల మండల పరిధి చిలువూరు గ్రామంలో ఇటీవల ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఎమ్మార్పీఎస్ స్టేట్ సెల్ కన్వీనర్, హైకోర్టు న్యాయవాది చిలువూరు నాగరాజు మాదిగ ఆధ్వర్యంలో మహిళలు నిరసన తెలిపారు. ఈ మేరకు మంగళగిరి ఆటోనగర్‌లోని ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి ప్రదర్శనగా చేరుకున్నారు. మద్యం దుకాణాన్ని తొలగించాలంటూ వారు నినాదాలు చేశారు. ఎక్సైజ్ శాఖ కమిషనర్ ప్రశాంత్ కుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం నాగరాజు, మహిళలు మాట్లాడుతూ ఇప్పటికే గ్రామంలో ఓ మద్యం దుకాణం ఉందని, అయినప్పటికీ అదనంగా మరో దుకాణాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించడం దారుణమని అన్నారు. సమీపంలో పాఠశాల ఉందని, ఇటుగా నిత్యం విద్యార్థులు, మహిళలు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. మద్యం వలన కుటుంబాలు చిద్రం అయ్యే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని మద్యం దుకాణాన్ని తొలగించాలని కోరగా, ఎక్సైజ్ శాఖ కమిషనర్ ప్రశాంత్ కుమార్ సానుకూలంగా స్పందించారని, మద్యం దుకాణానికి అనుమతులు నిలిపివేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామ మహిళలు, మంచికలపూడి రాహేల్, శిఖా సుందరమ్మ, వల్లభాపురం నాగరత్నం, చిలుకూరి అవ్వమ్మ, చిలువూరు నిర్మల, గరికపూడి నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ర్యాంకర్‌ను సన్మానించిన మేయర్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: యు.పి.ఎస్.సి సివిల్స్ నందు జాతీయ స్థాయిలో 146 వరకు సాధించిన చల్లా పవన్ కళ్యాణ్ ను నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర మంగళవారం నగరపాలక సంస్థ మేయర్ ఛాంబర్ నందు శాలువా మరియు బొకేతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరానికి చెందిన చల్లా పవన్ కళ్యాణ్ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్స్ నందు జాతీయ స్థాయిలో 146వ ర్యాంకు సాధించటం ఎంతో అభినందనీయమన్నారు. నేటి యువత చల్లా పవన్ కళ్యాణ్ ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చల్లా రమేష్, కసుకుర్తి హనుమంతరావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేత

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గుంటూరు జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ నేషనల్ ఆడిన క్రీడాకారులకు గుంటూరు జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, స్టేట్ జాయింట్ సెక్రటరీ కుమ్మర క్రాంతి కుమార్ మంగళవారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో సర్టిఫికెట్ అందజేశారు. జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2024-2025 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులకు ఫుట్బాల్ అకాడమీ సెలక్షన్స్ కొరకు గుంటూరు జిల్లాలో ఉన్నటువంటి క్రీడాకారులకి సెలక్షన్స్ జరుగుచున్నాయని తెలిపారు. ఇందులో సెలెక్ట్ అయిన వారు ఆంధ్రప్రదేశ్ ఫుట్బాల్ అకాడమీకి గుంటూరు జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ తరపున పంపించడం జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు క్రాంతి కుమార్, దుర్గా మోహన్ రావు తెలియజేశారు. ఆసక్తి ఉన్నవారు 7337585790, 642931771 సంప్రదించాలని తెలిపారు.

నెహ్రూనికేతన్‌కు ఉత్తమ పాఠశాల పురస్కార ప్రదానం

విశాలాంధ్ర-తెనాలి : గత 50ఏళ్లుగా విద్యారంగంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని పొందిన స్థానిక బోస్‌రోడ్డులోని నెహ్రూనికేతన్ పాఠశాలకు లీడ్ స్కూల్ వారు దక్షిణ భారతదేశంలోని అయిదు రాష్ట్రాలలో ఉత్తమ పాఠశాల శిక్షా పురస్కారాన్ని ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలిలోని లీ మెరిడియన్ హోటల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రదానం చేశారు. లీడ్‌స్కూల్ వ్యవస్థాపకులు, సితవో సుమిత్ మెహతా, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దీపక్ హరిహరన్ చేతులమీదుగా నెహ్రూనికేతన్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ విదాసరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి గీతాకాంత్ ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు మంగళవారం తెలియజేశారు. భారతదేశంలో లీడ్‌స్కూల్ కరికులంను అమలు చేస్తున్న మూడు వేల పాఠశాలల్లో నెహ్రూనికేతన్ ఒకటి. లీడ్‌స్కూల్ వారి ఆధునిక ప్లేవే మెథడ్స్‌తోపాటు చిన్నారుల్లో విద్య పట్ల ఆసక్తిని పెంచి, దృశ్య, శ్రవణ మాధ్యమాల ద్వారా పూర్తి స్థాయి ఏక్టివిటీ బేస్డ్ ఎడ్యుకేషన్‌ను నెహ్రూనికేతన్ ప్లే స్కూల్ అందిస్తుంది. లిటిల్ స్కాలర్స్ ప్రోగ్రామ్స్ ద్వారా నెహ్రూనికేతన్ చిన్నారులు నేర్చుకున్న విషయాలను, నిర్వహణను ప్రదర్శిస్తున్నప్పుడు వారి సామర్థ్యాన్ని పరిశీలించి, ప్రశంసిస్తూ లీడ్‌స్కూల్ వారు జోనల్‌స్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేసి ఈ పురస్కారాన్ని అందించారు. నెహ్రూనికేతన్ అందిస్తున్న విద్యా సేవలకు, ఉపాధ్యాయుల అంకితభావానికి మచ్చుతునక ఈ పురస్కారమని మురళీకాంత్, శ్రీమతి గీతాకాంత్ తెలియజేశారు.

జర్నలిస్టులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు: డాక్టర్ విజయ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : జర్నలిస్టులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఎదురైనా లలిత హాస్పిటల్ తరుపున పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందిస్తామని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.విజయ తెలిపారు. ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ అధ్యక్షురాలుగా ఎన్నికైన డాక్టర్ విజయను ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్ మీరా, కార్యదర్శి కె.రాంబాబు తదితరులు డాక్టర్ విజయను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ మాట్లాడుతూ ప్రజలు, వ్యవస్థలకు సంధానకర్తగా జర్నలిస్టులు పనిచేస్తారని తెలిపారు. వారి జీవన పరిస్థితులను అర్థం చేసుకుని తమవంతు బాధ్యతగా లలిత హాస్పిటల్ తరుపున ప్రత్యేక హెల్త్ కార్డులు అందజేస్తామని ప్రకటించారు. జర్నలిస్టులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు ఎదురైనా పూర్తిగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా బేసిక్ హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పుల్లగూర భక్తవత్సలరావు, శ్రీనివాసరావు, సువర్ణ, చలపతిరావు, పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, జగన్‌మోహన్ రెడ్డి, విద్యాధర మురళి, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

బాలబాలికలకు అన్నదానం

విశాలాంధ్ర- మంగళగిరి : నవులూరు షారోన్ చిల్డ్రన్స్ హోమ్‌లో తెలుగు యువత నాయకులు కాండ్రు కోమల్ కుమార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బాలబాలికలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కోమల్ కుమార్, రిషిత శ్రీ దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా యూత్ ఫెడరేషన్ ప్రతినిధులు మాట్లాడారు. యూత్ ఫెడరేషన్ చేసే సేవా కార్యక్రమాల్లో తమతో పాటు పాల్గొంటూ ప్రముఖ పాత్ర పోషిస్తూ సేవా కార్యక్రమాల్లో ముందుంటున్న కోమల్ కుమార్ సంపూర్ణ ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. ఫెడరేషన్ ప్రతినిధులు బాపనపల్లి శివరాం, మురికిపూడి నరేష్, సింగరాజు సాయి, అచ్చగట్ల పార్థసారథి, బాపనపల్లి కోటేశ్వరరావు, పంచుమర్తి శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, కుందర్ల హరీష్, లక్ష్మణ్, అభిరామ్, బాలు తదితరులు పాల్గొన్నారు. తొలుత మంగళగిరి శ్రీకృష్ణ చైతన్య వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

ఆశ వర్కర్ల సమ్మె నోటీసు



విశాలాంధ్ర-పెదనందిపాడు : ఈ నెల 20వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను పురస్కరించుకొని సోమవారం పెదనందిపాడు ఆశా కార్యకర్తలు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కమలాకర్‌కు సమ్మె నోటీసు ఇచ్చారు. నోటీసు ఇచ్చిన వారిలో ఆశ వర్కర్స్ జిల్లా యూనియన్ గౌరవ అధ్యక్షురాలు వై.రమణ, సరళాదేవి, రాణి, సరిత, రత్నకుమారి తదితరులు ఉన్నారు.

విశాలాంధ్ర

ఘనంగా మేడే వేడుకలు

విశాలాంధ్ర-దాచేపల్లి: నడికూడి గిడ్డంగుల యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కార్మికులు మేడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తొలుత జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ముస్యం వెంకటేశ్వర్లు, కార్యదర్శులు వలీ, శ్రీను, కౌన్సిలరు షేక్ షరీఫ్ తదితరులు మాట్లాడారు. నారాయణపురంలో పల్నాడు బలహీనవర్గాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకల్లో ఏళ్ళ తరబడి పేపరు బాయ్‌లుగా చేస్తున్న కొండలు, భార్గవ్‌ను సాగి నాగేశ్వరరావు, మెడికల్ షాపు శివ ఘనంగా సత్కరించారు. కౌన్సిలరు షేక్ షరీఫ్, గరికపాటి వెంకటకుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి సామాగ్రి అందజేత

విశాలాంధ్ర - దాచే పల్లి : అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఓ నిరుపేద కుటుంబా నికి సామాగ్రి అందజేశారు. ముస్లిం కుటుంబంలో యువతి పెళ్లికి తమ వంతు సాయంగా ఈ సామాగ్రి ఇచ్చారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు మౌలానా ముస్తఫా, సభ్యులు, మత పెద్దలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి కాసు పరామర్శ

విశాలాంధ్ర - దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లిలో నెమలి వెంకటరెడ్డి అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి మృతదేహన్ని సందర్శించి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పార్టీ శ్రేణులు ఉన్నారు.

విజ్ఞాన గ్రంథాలతో మనోవికాసం

విశాలాంధ్ర-ఈపూరు: ప్రతి ఒక్కరూ ఖాళీ సమయంలో విజ్ఞానదాయక గ్రంథాలను చదివితే మనోవికాసం చేకూరుతుందని గ్రంథాలయ అధికారి జి.శ్రీనివాసరావు అన్నారు. వేసవి శిక్షణలో భాగంగా మండల కేంద్రమైన ఈపూరు గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. కథలు, పుస్తక పఠనం తరువాత వాటిని సమీక్షించుకుంటే మరింత ఉన్నతి చేకూరుతుందని ఆయన తెలిపారు.

కాగితాలు ఏరుకొనే వ్యక్తి మృతి

విశాలాంధ్ర-దుర్గి: లారీ క్రింద పడి కాగితాలు ఏరుకొనే వ్యక్తి దుర్గి హైస్కూల్ వద్ద మంగళవారం ఉదయం 9 గంటలకు మృతి చెందాడు. పోలీస్ వారి సమా చారం ప్రకారం మాచర్ల గ్రామానికి చెందిన మామిళ్ళ అంజి (45) దుర్గి గ్రామంలో కాగితాలు ఏరుకొనేందుకు వచ్చాడని తెలిసింది. దుర్గి హైస్కూల్ దగ్గర కాగితాలు ఏరుకుంటున్న సమయంలో మాచర్ల నుండి ఒంగోలు వెళుతున్న కె.సి.పి. సిమెంట్ లోడ్ గల ఏపీ 07టి ఎఫ్ 4551 నెంబర్ గల లారీ హైస్కూల్ స్పీడ్ బేకర్‌ను దాటు తున్న సమయంలో కాగితాల మూట లారీకి తగిలి వెనుక టైర్ క్రింద పడటంతో రెండు కాళ్ళు నలిగి పోయాయి. అతనిని 108అంబులెన్సులో మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృత దేహన్ని పోస్టు మార్టం కోసం పోలీసులు జి.గోపి, టి.వాళేశ్వరరావులు మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. లారీ డ్రైవర్ బత్తుల శ్రీనివాసరావును, లారీని అదుపులోకి తీసుకున్నామ న్నారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై సుధీర్ కుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సీహెచ్‌వోల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: సీహెచ్‌వోల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు డిమాండ్ చేశారు. విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో గత 7 యేళ్లుగా ప్రజలకు పంచాయతీ పరిధిలో ఆరోగ్య సేవలను అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌కు ఆర్థికంగా, అర్థికేతర సమస్యల పరిష్కారం, రావలసిన బెనిఫిట్స్ కోసం చేపట్టిన సమ్మె మంగళవారానికి 9వ రోజుకు చేరాయి. వారి ఆందోళనకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన కాసా రాంబాబు మాట్లాడుతూ సీహెచ్‌వోలను రెగ్యులర్ చేయాలని, ఎన్‌హెచ్‌ఎం 23శాతం హైక్ అమలు చేయడం, ఇంక్రిమెంట్ పాలసీ ప్రారంభించడం, ఈపీఎఫ్‌వో బెనిఫిట్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఆరోగ్య మంత్రి దగ్గరికి వెళ్తే జాబ్ తీసేస్తాం, మీరు కాంట్రాక్టు ఉద్యోగులు అని బెదిరింపు దోరణిలో సీహెచ్‌వోల పట్ల అను చిత వ్యాఖ్యలను ఆయన ఖండించారు. తన మాటలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, చర్చలు జరిపి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సాగర్, రాము, అనుపమ, మస్తాన్. ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఉప్పలపాటి రంగయ్య, వెంకట్, చక్రవాకం సత్యనారాయణ రాజు, ప్రసన్నకుమార్, దాసరి వరహాలు, నాగేశ్వరావు తదితరులు ఉన్నారు.

లాభసాటిగా ఉద్యానవన పంటల సాగు

విశాలాంధ్ర-దుర్గి: ఉద్యానవన పంటల సాగు రైతులకు లాభసాటిగా ఉంటుందని డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉద్యానవన పంటలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం నుండి ఉద్యాన శాఖలో ఈ పంటలకు రాయతీలు కూడా ప్రభుత్వం పెంచిందన్నారు. పండ్లు, పూల తోటలపై ప్రభుత్వ పరంగా వచ్చే రాయతీలను గురించి రైతులకు అవగాహన చేయాలని సిబ్బందికి పిలుపు నిచ్చారు. ఐదు ఎకరాల లోపుఉన్న రైతు లకు ఉపాధి హామీ పథకం కింద 100శాతం రాయితీతో పండ్ల తోటలను వేసుకోవచ్చు అన్నారు. మండల వ్యవసాయాధికారి వై అమ్మిర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యాన పంటలు మంచి దిగు బడు లతో రైతులకు లాభాలను అందిస్తుందన్నారు. ఉద్యాన వన పంటలతో పాటు సేద్యపు నీటి కుంటలు గురించి చర్చించు కున్నారు. ఈ అవగా హన కార్యక్రమంలో ఎం పి డి.ఓ శివ ప్రసాద్, ఏపిడి గుర జాల ఇంచార్జి,మండల ఏపీఓ కొరటా మల్లిఖార్జునరావు, ప్లాంటేషన్ సూపరైజ్యర్, కారంపూడి, దుర్గి మండలాల ఉపాధి హామీ పథ కం సిబ్బంది, అగ్రికల్చర్ అసి స్టెంట్ లు, హార్టీ కల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: నిబంధనలకు విరుద్ధంగా వేసవిలో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య నాయకులు కోరారు. ఈ మేరకు ఎంఈవో ఎ శ్రీనివాసరావును మంగళవారం కలసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ నిబంధనలు తుంగలో తొక్కి విద్యార్థుల ఆరోగ్యం గురించి పట్టించుకోకుండా తరగతులు నిర్వహించటం దారుణమన్నారు. అడ్మిషన్లు పెంచుకోవడమే లక్ష్యంగా, ధన దాహంతో వేసవి సెలవుల్లో కూడా విద్యార్థులను తరగతి గదులకు పరిమితం చేస్తూ వారిని మానసిక ఒత్తడికి గురి చేస్తున్నారని విమర్శించారు. విద్యావ్యవస్థలో లోపాలు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎవరైతే వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించి ప్రభుత్వ ఉత్తర్వులను పక్కన పెడుతున్నారో వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు సంబంధిత విద్యాసంస్థలకు ప్రభుత్వ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను రక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే చర్యలు చేపట్టకుంటే విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మేకపోతుల నాగేశ్వరరావు, నాయకులు గుడిపల్లి జగదీష్, నాయుడు సాయి శ్రీన్యాద్, కంచర్ల సన్నీ, అన్నం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికల భవితకు కిశోరి వికాసం

విశాలాంధ్ర-పెదకూరపాడు: యుక్తవయస్సులో ఉన్న బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్‌కు కిశోరి వికాసం ఎంతో దోహదపడుతుందని 75 ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికా సూపర్వైజర్ ఎస్కే మున్ని పేర్కొన్నారు. కౌమార బాలికల సాధికారిత లక్ష్యంగా జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కిశోరీ వికాసంపై గోడపత్రికలను ఆవిష్కరించారు అనంతరం మాట్లాడుతూ ఈనెల 2నుంచి జూన్ 10 వరకు వివిధ శిక్షణా కార్యక్రమాలను యుక్తవయస్సు బాలికలకు అందిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ శాఖలను సమన్వయం చేసుకుంటూ ప్రాజెక్టు పరిధిలోని ప్రత్యేక సమ్మర్ క్యాంపెయిన్ గ్రామ, వార్డు స్థాయిలో కిశోరీ బాలికల సాధికారత కొరకు ఆరు అంశాలను చర్చిస్తూ ముందుకు సాగే విధంగా పుస్తకాలను రూపొందించారన్నారు. ఇందులో భాగంగా యుక్తవయస్సు బాలికలకు విద్య ప్రాముఖ్యత, సంపూర్ణ ఆరోగ్యం, రుతుపరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, ఉన్నత విద్య, కెరీర్ మార్గదర్శనం, రక్షణ అంశాలు, బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాలు, సైబర్ భద్రత, పోక్సో చట్టం వంటి అంశాల్లో శిక్షణా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం మొత్తం విజ్ఞానవంతంగా, ఆనందోత్సాహంగా ఉండాలని, ప్రతీ కిశోర బాలిక పాల్గొనేలా చూడాలని అన్నారు.

జూలకల్లులో పోలీసుల కార్డెన్ సెర్చ్

విశాలాంధ్ర - పిడుగురాళ్ల : మండలంలోని జూలకల్లు గ్రామంలో మంగళవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు ఆధ్వర్యంలో గ్రామంలోని ఇరు పార్టీలకు చెందిన ఇళ్లల్లో కార్డెన్ సెర్చ్ జరిగింది. తెల్లవారుజామునే డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది ఏక కాలంలో అనుమానిత ప్రదేశాలు, ఇళ్లను సోదా చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గ్రామంలో ఇటీవల జరుగుతున్న ఘర్షణలు, దాడులు నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా కార్డెన్ సెర్చ్ చేపట్టినట్లు తెలిపారు. సెర్చ్‌లో సరైన ధ్రువపత్రాలు లేని 30 మోటార్ సైకిళ్లను సీజ్ చేసి, కత్తులు, వేట కొడవళ్ళు, గొడ్డళ్లు, గడ్డపలుగులు, ఇను పరాడ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటిలో కొన్ని వ్యవసాయ పనిముట్లు ఉన్నప్పటికీ గ్రామంలోని ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో వాటిని ముందు జాగ్రత్తగా సీజ్ చేస్తున్నామన్నారు. సిఐ వెంకట్రావు, ఎస్ఐలు మోహన్, శివనాగరాజు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

విశాలాంధ్ర-దాచేపల్లి: వ్యవసాయం అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నగర పంచాయతీ నడికూడి ఒకటో సచివాలయంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు యూనిట్ ఇన్చార్జి కొత్తపల్లి రమేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన కోగంటి శివన్నారాయణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో తన అనభవాలను వివరించారు. రానున్న ఖరీఫ్ సీజన్లో ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణాన్ని పెంచాలని రైతులకు సూచించారు. పంట మార్పిడి విధానాన్ని కూడా అవలంభించాలని కోరారు. నేతలు నర్రా పుల్లయ్య, గోళ్ళ నారాయణ, ఐనాల శ్రీరాములు, వ్యవసాయ శాఖ ఉద్యోగి మస్తాన్ మాట్లాడారు. అనంతరం ఏళ్ళ తరబడి ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అవలంభిస్తున్న కోగంటి శివన్నారాయణను ఘనంగా సత్కరించారు.

ప్రేక్షకులను రజింపచేసిన నాటికలు

విశాలాంధ్ర-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో ఐదవ నాటకోత్సవాలు అమరావతి లోని సత్తెనపల్లి క్రాస్ రోడ్డు వద్ద ప్రారంభమయ్యాయి. మొదట ప్రదర్శనగా భక్త చింతామణి దేవనర్తకి దీనిలో ప్రధాన పాత్రధారులుగా బిల్వమంగళుమూర్తిగా జాస్తి సత్యమూర్తి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమనలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరా పట్నం రామకృష్ణ నటించగా, భవాని శంకరులుగా సిహెచ్ ఉదయ శేఖర్, మురుకొండ నాగేశ్వరరావు, భక్త చింతామణిగా నాట్య మయూరి జి.రత్నకుమారి తదితరులు నటించారు. రెండో ప్రదర్శన సత్య హరిశ్చంద్ర ప్రధాన పాత్రధారులైన యూ నరసింహారావు, భాస్కర్ రెడ్డి, ఆంజనేయులు, గుంజి శ్రీనివాసరావు నటించగా నక్షత్ర పాత్రధారులుగా పోతురాజు కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, బాబురావు, చంద్రమతి పాత్రధారినిగా బి.రత్నజ తదితరులు నటించారు.

ప్రపంచ ఆస్తమా దినోత్సవం

విశాలాంధ్ర-యద్లపాడు: మే నెల మొదటి మంగళ వారం ప్రపంచ ఆస్తమా దినోత్సవంగా జరుపుకుంటారని, దీని ప్రాముఖ్యతను, నివారణ గురించి తిమ్మాపురానికి చెందిన నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ అధ్యక్షురాలు సువర్ణ కుమారి మంగళవారం వివరించారు. దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని శ్వాసనాళాల్లో వాపు, శ్లేష్మం పెరగడం వలన వస్తుందన్నారు. ఎలర్జీ ఇతర కారకాల వలన ఈ రకమైన ఇబ్బంది ఏర్పడుతుం దని, వాటిని గుర్తించి నివారించుకోవాలని సూచించారు. వచ్చిన తర్వాత పూర్తిగా తగ్గించలేం కావున పెరగకుండా, రాకుండా నివారించడమే ఉత్తమ మార్గమని అన్నారు. కార్యక్రమంలో భాగంగా మండల ఆశా వర్కర్లకు యూనిఫారం పంపిణీ చేశారు. సంస్థ ఉపాధ్యక్షుడు వై ప్రసాదరావు, ప్రాథమిక ఆరోగ్య వైద్యశాల సిహెచ్‌ఓ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీకి స్థల పరిశీలన



విశాలాంధ్ర - వినుకొండ : స్థానిక ఏనుగుపాలెం రోడ్డులోని రైల్వే గేట్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కొరకు రైల్వే అధికారులతో కలిసి తాహశీల్దార్ ఎం. సురేష్ నాయక్, వినుకొండ మరియు ఇతర రెవెన్యూ అధికారుల స్థలం పరిశీలించారు.

కాలనీవాసులకు అండగా ప్రజా సంఘాలు

విశాలాంధ్ర-నరసరావుపేట: ఎన్నో సంవత్సరాలుగా నివాసం ఉంటున్న ప్రజలను ఒక్క సారి ఖాళీ చేయించాలని అధికారులు తీసుకున్న నిర్ణయానికి బాధిత ప్రజలకు ప్రజా సంఘాలు మద్దతుగా నిలవడంతో వారి ప్రయత్నాలకు గండి పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. నరసరావుపేట మండలం లింగంగుంట శృంగేరి శంకర మఠం 'బ్రాహ్మణ అగ్రహారం' క్రింద 18 వందల ఎకరాల భూమి ఉంది. అందులో ఎన్ఎస్‌పి కాలనీ క్రింద 43 ఎకరాల భూమిని పీఠాధిపతి దానం చేశాడు. ఈభూమిలో 8ఎకరాల భూమిని శంకర భారతి హైస్కూల్‌కు కేటాయించగా, మిగిలిన 35 ఎకరాల భూమిని ఎన్ఎస్‌పిలో పనిచేసిన ఉద్యోగులకు క్వార్టర్స్ నిర్మాణం చేసారు. గత 60 సంవత్సరాలుగా ఈ కాలనీలో షుమారు 300 కుటుంబాలు నివాసం ఉండేవారు. అందులో ఆర్థిక స్తోమత గలిగిన కొన్ని కుటుంబాలు నివాస స్థలాలు కొనుగోలు చేసి వెళ్లి పోయారు. మరికొన్ని కుటుంబాలకు గత ప్రభుత్వం నివాస స్థలాలు కేటాయించింది. కానీ ఇళ్ల నిర్మాణం మరచింది. పట్టాల్లోనే నివాస స్థలాలు ఉన్నాయి. ఆ పట్టాలు కూడా గత ప్రభుత్వం తీసుకుంది. ఎన్ఎస్‌పి కాలనీలో శిధిలావస్థలో ఉన్న క్వార్టర్స్ లో ప్రస్తుతం 62 కుటుంబాలు (విశ్రాంత ఉద్యోగులు,పెన్షనర్లు)మాత్రమే గత 40 సంవత్సరాలుగా నివశిస్తూ కాలం వెళ్ళ తీస్తున్నారు. ఇందులోనే ముఖ్యంగా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు ఏర్పరచి పాలన కొనసాగిస్తున్నారు. అప్పటి నుండి కాలనీ వాసులకు కష్టాలు మొదలయ్యాయి. వారు నివశిస్తున్న కాలనీలోనే వారు పరాయివారయ్యారు. కాలనీ వాసులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే క్వార్టర్స్ కాళీ చేసి వెళ్లి పోవాలని హుకుం జారీ చేస్తున్నారు. పోలీసుల హెచ్చరికల నేపథ్యంలో 62 కుటుంబాలు సమావేశం నిర్వహించారు. మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధి అరవింద బాబును, జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు. విషయం పసిగట్టిన పోలీసులు ఎస్‌పి, కలెక్టర్ ఆదేశాల మేరకు కాలనీవాసులు కలెక్టర్ కాంపౌండ్ దాటకుండా ఆంక్షలు విధించారు. విషయం తెలుసుకున్న కుల నిర్మూలనా పోరాట సమితి, ప్రగతిశీల కార్మిక సమాఖ్య, సిపిఎం, సిపిఐ, ముస్లిం, బిసి సంఘాల నాయకులు బాధితులకు అండగా నిలిచారు. బాధితులకు అండగా నిలిచిన వారిలో కె.కృష్ణ రాష్ట్ర కార్యదర్శి, జక్కా బ్రహ్మయ్య, చలంచర్ల అంజి (కుల నిర్మూలనా పోరాట సమితి) కంబాల ఏడుకొండలు, శిఖినం సాంబయ్య, జిల్లా కమిటీ సభ్యులు (ప్రగతిశీల కార్మిక సమాఖ్య), కాసా రాంబాబు జిల్లా సహాయ కార్యదర్శి (ఏఐటీయూసీ), వైదన వెంకట్ ఏరియా కార్యదర్శి (సీపీఐ), బాదుగున్నల శ్రీనివాసరావు రాష్ట్ర అధికార ప్రతినిధి (బిసి సంక్షేమ సంఘం)వై గోపాల రావు జిల్లా నాయకులు (రైతుసంఘం),ఎస్ కె మస్తాన్ వలీ జిల్లా కార్యదర్శి (ఎంఐఎం), గోదా జాన్ పాల్ రాష్ట్ర అధ్యక్షులు (మాలమహానాడు)బోరుగడ్డ అంబేద్కర్ జిల్లా కార్యదర్శి (మాలమహానాడు) నేలటూరి మురళి మాజీ కౌన్సిలర్ (12వార్డు) గోదా రమేష్ వ్యవస్థాపక అధ్యక్షులు (బహుజన హక్కుల పోరాట సమితి) ఉన్నారు,

ఆదర్శప్రాయులు శ్రీధర్‌బాబు: రమేష్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : టొబాకో బోర్డులో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పని చేసిన టుబాకో బోర్డు మాజీ ఈడీ డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు ఆదర్శప్రాయులు అని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్ కొనియాడారు. గుంటూరులోని జ్యోతి నిలయం హాలులో డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబుకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అభినందన సన్మాన కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పని చేసి ఉత్తరాఖండ్ రాష్ట్రానికి బదిలీ అయిన సందర్భంగా ఆయనకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పావులూరి రమేష్ మాట్లాడుతూ డాక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు టొబాకో బోర్డును రైతుల పాలిట కల్పవృక్షంగా మార్చినారని ప్రశంసించారు. పొగాకు రైతుల సమస్యలను అర్థం చేసుకొని పరిష్కార మార్గాలను అధ్యయనం చేసేవారని తెలిపారు. బ్యాంక్ ఉద్యోగిగా ప్రారంభమై ఐపీఎస్ అధికారిగా, ఐఏఎస్ అధికారిగా ఎదుగుతూ సమాజానికి రోల్ మోడల్‌గా డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు మారారని కొనియాడారు. జేడీవిఎస్‌డబ్ల్యూఎస్, సెంటర్ ఫర్ సోషల్ సైకాలజీ, మానవత, స్టెప్ సంస్థల నేతలు డాక్టర్ అద్దంకి శ్రీధర్ బాబును ఘనంగా సత్కరించి శాలువ కప్పి మెమొంటోను అందించి అభినందించారు. ఉప్పల సాంబశివరావు, బీఏస్ మిత్ర, హర్ష, టి.ధనుంజయ రెడ్డి, నల్లమోతు సాంబశివరావు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పక్కాగా నిర్వహించాలి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గుంటూరు నగరంలో పారిశుధ్య పనులు పక్కాగా నిర్వహించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలి పారు. మంగళవారం నగర కమీషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి కౌన్సిల్ సమావేశమందిరం నందు నగరంలో పారి శుధ్య పనుల నిర్వహణ పై సచివాలయ ఎన్విరాన్మెంట్, ఎమినిటి కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మే యర్ మాట్లాడుతూ గుంటూరు నగరం అమరావతి రాజధాని ప్రాంతంలో భాగం గా ఉన్నందున, రాజధాని ప్రాంతానికి ఎంతో మంది వివిధ పనుల పై వస్తుంటారని, వారు గుంటూరు నగరం మీదుగా వచ్చే అవకాశం ఉంటుందని, వారు గుంటూరు నగరానికి వచ్చే సందర్భంలో పారిశుధ్యం బాగా లేకపోతే గుంటూరు కార్పొరేషన్ కు చెడ్డ పేరు వస్తుందని, కావున కార్యదర్శులు, శానిటరీ ఇన్స్పెక్టర్లు తమ డివిజన్ల పరిధిలో తిరుగుతూ పారిశుధ్య పను లను పర్యవేక్షిస్తూ పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. అంతేకాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా గుంటూరు నగరం పై ప్రత్యేక దృష్టి సారించి, నగరాభివృద్ధికి సహకారాలు అందిస్తున్నారన్నారు. కార్యదర్శులకు, శానిటరీ ఇన్స్పెక్టర్లకు పారిశుధ్య పనుల నిర్వహణలో సమస్యలేమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య పనుల నిర్వహణలో పిర్యాదులు అందుతున్నాయని, విధుల యందు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సి.యమ.ఓ.హెచ్ డాక్టర్ అమృతం, యస్.ఈ నాగమల్లేస్వర రావు, ఈ.ఈ లు సుదరరామి రెడ్డి, కోటేశ్వర రావు, యస్.యస్ లు, ఎ.ఈ లు శానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు

గొప్ప రాజధానిగా రూపుదిద్దుకుంటున్న అమరావతి:దేగల



విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : దేశంలోనే అమరావతి రాజధాని గొప్ప రాజధానిగా రూపుదిద్దుకుంటుందని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. మంగళవారం గుంటూరు అర్బన్ టీడీపీ కార్యాలయంలో చైర్మన్ ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వ పాలనలో జగన్ రెడ్డి తన పరిపాలనతో ప్రజల రాజధాని అమరావతిని పూర్తిగా ధ్వంసం చేశారని, మాట తప్పను, మడమ తిప్పను అని చెప్పిన జగన్ రెడ్డి ఆంధ్రుల రాజధాని అమరావతి విషయంలో ఎందుకు మాట మార్చారాని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ప్రజల అమరావతి పునఃనిర్మాణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు. ప్రపంచానికే దీటైన రాజధానిగా ప్రజల రాజధాని అమరావతి నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వంలో, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాజధాని అమరావతి పునర్నిర్మాణం వేగంగా జరుగుతుందన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో రాజధాని అమరావతి అభివృద్ధిలో పరుగులు తీస్తుందని, గడిచిన పది నెలల్లో సంక్షేమం, అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తుతుందన్నారు.

ప్రకటన

మా క్లయింట్ రంగావఝుల లక్ష్మీపతి, తండ్రి: (లేటు) అక్కంబొట్లు, డో.నెం.5-121, బ్రాహ్మణ వీధి, ఖాజీపాలెం గ్రామము, పిట్టలవాని పాలెం మండలం, బాపట్ల జిల్లా వారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా:

మా క్లయింట్ కుమారుడైన రంగావఝుల హరీష్ ది. 05.07.2028న, Little Flower Society of Assissi Sisters of Mary Immaculate Rep. by its Provincial Sister ఇస్బెల్ ఫ్రాన్సిస్ నుండి గుంటూరు రెవిన్యూ జిల్లా, అమరావతి రిజిస్ట్రేషన్ జిల్లా, తుళ్ళూరు మండలం, మందడం, తాలూకు డో.నెం.281రు య.4.20 సెంట్స్‌లో య.0.09 సెంట్లు లేక చ.గ లో 435 లు క్రయం పొంది ఒక విక్రయ దస్తావేజును వ్రాయించుకొని దానిని ది.05.07.2018 మందడం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసు నందు Doc No. 4629/ 2018 ద్వారా క్రయం పొంది ఉన్నారు. అదే విధముగా, మా క్లయింట్ బంధువైన చల్లపల్లి అచ్యుతరావు గారి కుమారుడు చల్లపల్లి సోమేశ్ కూడా వారి వద్ద నుండే య.0.09 సెంట్లు లేక చ.గలో 435లు క్రయం పొంది. ఒక విక్రయ దస్తావేజును వ్రాయించుకొని దానిని ది.05.07.2018 మందడం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసు నందు Doc No. 4632/2018 ద్వారా క్రయం పొంది ఉన్నారు. మా క్లయింట్ ది. 03.05.2025న ఆ భూమికి సంబంధించిన ఒరిజినల్ రెండు డాక్యుమెంట్లను ఫోటోస్టాట్ తీయించుటకై ఖాజీపాలెం సెంటరులో ఫోటోస్టాట్ గల షాపుకు తీసుకొని వెళ్ళగా పైన తెలిపిన Doc.s No. 4629/2018, 4632/2018 పోయినవి. అట్టి డాక్యుమెంట్లు ఎవరికైనను దొరికినచో క్రింద తెలిపిన మా చిరునామాను సంప్రదించి అందచేయగలరు. అందుకు గాను మా క్లయింట్ తగిన పారితోషకం ఇవ్వగలవారు. అట్లుకాక ఎవరైననూ సదరు డాక్యుమెంట్లను ఉపయోగించి ఏ విధమైన లావాదేవీలు జరిపిన యెడల మా క్లయింటును బైండ్ చేయజాలవు. అట్లు జరిపిన యెడల మా క్లయింట్ తీసుకొనబోవు సివిల్, క్రిమినల్ కేసులకు బాధ్యులగుదురని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు
Sd/- పి. నాగ వెంకట లక్ష్మీనారాయణ ఆదిత్య
అడ్వకేట్
సూర్యారావు పేట, విజయవాడ-520002.
ఫోన్: 8885917712

CHANGE OF NAME

I, **MANDE SHYAMALA** Mother of **No:16114366A**, **Rank:Hav**, **Name: Mande Babu Rao**, Resident of Vill-Nizampatnam, Post-Nizampatnam, Teh-Nizampatnam, Distt-Bapatla, State-Andhra Pradesh, Pin - 522314, That I have change my name from **MANDE SYAMALA** (Mother as Service Docu) to **MANDE SHYAMALA** (Proposed new name of mother) vide affidavit dated 02nd May 2025, Repalle, my date of Birth is **01-01-1973.**

సౌత్ ఇండియన్ బ్యాంక్
Experience Next Generation Banking

గుంటూరు బ్రాంచి, డోర్ నెం.4-1-1, గాయత్రి ప్లాజా, కొరిటిపాడు మెయిన్‌రోడ్, గుంటూరు. ఫోన్ : 0863-2245655
ఇ-మెయిల్ : br0378@sib.co.in

బంగారు నగల వేలము నోటీసు

ఇందుమూలముగా తెలియజేయుట ఏమనగా మా బ్యాంకు ద్వారా బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న రుణములు ఎన్ని నోటీసులు పంపిననూ దిగువ తెలిపినవారు తమ బాకీలను చెల్లించియుండలేదు. రుణము చెల్లించవలసిన కాలము గతించినందున సదరు బంగారునగలను **ది.13-05-2025, మంగళవారం మధ్యాహ్నం 3-00 గం॥**లకు మా బ్రాంచి ఆవరణలో బహిరంగ వేలము వేసి వారి పేరునయున్న బకాయిలకు జమ కట్టుకొనెబడును. వేలములో పాల్గొనదలచినవారు **ది.13-05-2025 మధ్యాహ్నం 12-00 గం॥**లోపు **రూ.2500/-** లను డిపాజిట్‌గా చెల్లించవలయును. ఎట్టికారణము చూపకనే వేలమును రద్దుచేయుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. వేలము వేసినా బకాయిలు రద్దు కాని యెడల వారిపై చట్టరీత్యా తగుచర్య తీసుకొని మిగిలిన బకాయిలు వసూలు చేయబడును మరియు వేలము, తదితర ఖర్చులు వారి ఖాతాలకు వ్రాయబడును. ఈ దిగువ పేర్కొనబడిన ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలము నోటీసు వర్తిస్తుంది.

గోల్డ్‌లోన్ ఖతా నెం.	లోన్ అమౌంట్	ఖాతాదారుని పేరు	తూకం మొత్తం గ్రాములలో
0378.653.35504	రూ.10,200/-	నిశ్శంకరరావు భవాని శంకర్	2.30

బహిరంగ ప్రకటన

నా క్లయింటు (ఉద్యోగ రీత్యా) తమిళనాడు, కోటూరు చెన్నై - 85, కరుణానిధి 1వ వీధి, 3/ఎ పాత నెంబరు, 5-కొత్త నెంబరు కాపురస్తులు చిత్తూరి వెంకట అనంద్ గారి భార్య **చిత్తూరి సాయికుమారి** గారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది.

నా క్లయింటు పేరిట గుంటూరు జిల్లా, మంగళగిరి డి.నెం.307 నందు 369 చదరపు గజముల స్థలము కలదు. సదరాస్తి నా క్లయింటు పేరిటకు ది.25-04-2008న ఆమె భర్తగారైన చిత్తూరి వెంకట ఆనంద్ ద్వారా దఖలు దస్తావేజు నెం.3609/2008 రుగా మంగళగిరి సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయంలో రిజిష్టరు కాబడినది. కాగా, సదరు దస్తావేజునకు లింకు దస్తావేజు అయిన విక్రయ దస్తావేజు నెం.**3800/1982** (మంగళగిరి యస్ఆర్‌ఓ) ఒరిజినల్ మరికొన్ని దస్తావేజులు తీసుకుని మంగళగిరి, నవులూరు రోడ్డు నందలి స్థలము వద్దకు ది.**16-04-2025**న నా క్లయింటు వచ్చారు. అంతట సదరు దస్తావేజులు జిరాక్సు తీయించుకునేందుకు నవులూరు సెంటర్‌కు ఆటోలో వెళ్లుచుండగా మార్గమధ్యలో పైన పేర్కొన్న లింకు దస్తావేజు నెం. **3800/1982** ఎక్కడో జారిపడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల నాకు గానీ, నా క్లయింటుకు గానీ తెలియజేయగలరు. అలా తెలియజేసిన వారికి తగిన పారితోషికము ఇవ్వబడును.

సదరాస్తిపై ఎవరికైనా ఎట్టి అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉన్న యెడల ఈ ప్రకటన ప్రచురితమైన తేదీ నుండి 15 రోజులలోగా తెలియజేయగలరని కోరడమైనది.

సయ్యద్ ఆసిఫ్ అలీ, అడ్వకేట్, కోబాల్డ్‌పేట, గుంటూరు. సెల్ నెం. 93941 55522

ఎల్.ఐ.సి. బాండ్ పోయినవి

గుంటూరు జిల్లా, పెదనందిపాడు(మం), నాగులపాడు గ్రామ కాపురస్తులు పాటిబండ్ల శేషారావు గారి కుమారుడు పాటిబండ్ల సుధాకరరావు (సెల్:8466846146) అను నేను తెలియజేయునది ఏనమగా.నా పేరిట గల ఎల్.ఐ.సి (జీవిత బీమా సంస్థ) పాలసీ నెం.672776886 ఒరిజినల్ బాండును నాగులపాడు నుండి పెద నందిపాడుకు టూవీలర్‌పై వెళ్లుచుండగా ది.25-04-2025న పోగొట్టుకున్నాను. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

IN THE COURT OF THE 84th COMMERCIAL COURT BENGALURU AT BENGALURU

COM.OS No.367/2025 CCH-84

BETWEEN: Sri Naveen Chhajer, The Proprietor of M/s. Sha Mangilal Shantilal & Co. **...Plaintiff**
AND: M/s. Sarnam Family Shopping Mall **...Defendant**

No.1A SUMMONS/NOTICE FOR SERVICE BY ADVERTISEMENT IN A NEWS PAPER (0.5 R.20) OF CPC 1908

SUMMONS TO DEFENDANT BY WAY OF PAPER PUBLICATION.

Schedule Shop Premises Address:
M/s. Sarnam Family Shopping Mall, D. No. 22-14-9, Medical Hall Road Lalapet, GUNTUR-522001 (Andhra Pradesh) (Rep. by Its Proprietor Smt. Maha Lakshmi Saranam) E-mail.Srmahi73@gmail.com, Mob. 9849976999

Whereas, M/s. Sha Mangilal Shantilal & Co., Located at No.10, Vimala Enclave, Chowlugalli, Cubbonpet, Bengaluru-560 002, has instituted the above Commercial Suit against you for recovery of money in COM-OS/367/2025 on 07.03.2025, for recovery of due payment of Rs.3,55,246/-(Rupees Three Lakh Fifty-Five Thousand Two Hundred Fourty-Six Only). You are hereby summoned to appear in this Hon'ble Court in person or by a pleader on **02.07.2025 at 10:30 AM** to answer the same, failing which the Plaint will be disposed of ex-Parte

Given under my hand and the seal of the court this day of 25.04.2025

By Order of the Court
***Sd/-* Senior Sheristedar**
Commercial Court Unit
City Civil Court Bengaluru

Advocate for Address:
Kumarpal Munoyath, No.32, Appaji Rao Lane, C.T. Street Cross, Bengaluru-560 002.

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL
D.No.31-31-21, SRI SAI BABA STREET, DABAGARDENS, VISAKHAPATNAM.

I.A. No. 1120 / 2025 in S.A. No.185/2025

Between :
Yesepu Gantela, D.No.25-18-118, Parvathi Puram and another ...Appellants

And

1)The Authorized Officer, JM Financial Asset Reconstruction Company Limited, 7th Floor, Cnergy, Appasaheb Marathe Marg, Prabhadevi, Mumbai 400025. & 2 Others ....Respondents

To:
R-2: The Branch Manager, JM Financial Asset Reconstruction Company Limited, D.No. 7-1-616 & 617/A, Imperial Towers, 4th Floor, Ameerpet, Mian Road, Hyderabad 500016. Telangana.
R-3: Dewan Housing Finance Corporation Limited, Door No. 4-8-448, First Floor, Koritepadu Main Road, Koritepadu, Guntur, AP-522007.

SUMMONS BY WAY OF PAPER PUBLICATION R2 & R 3

WHEREAS, I.A 1120/2025 IN S.A. No.185/2025 was listed before Hon'ble Presiding Officer/Registrar on 28/05/2025WHEREAS, this Hon'ble Tribunal is pleased to issue summons/notice on the said Securitization Application under section 17(1) of the Act (SA) with IA filed against you by challenging the actions taken by the respondent bank authorized officer against the property application along with copies of documents etc. annexed).

In accordance with sub-section (1) of section 17 of the Act, you, the respondents/defendants are directed as under:-(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under the Securitisation Application.(ii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under the Securitization Application, pending hearing and disposal of the application for attachment of properties(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under the securitization application without the prior approval of the Tribunal.(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.You are also directed to file a written statement, Reply with a copy thereof furnished to the applicant and to appear before presiding Officer/Registrar on **28/05/2025** at **10:30 AM**. Failing the application shall be heard and decided in your absence.

REGISTRAR, DEBTS RECOVERY TRIBUNAL, VISAKHAPATNAM

పెనుగొండను కలిసిన ఆజాద్, మోహిద్దీన్

విశాలాంధ్ర - వినుకొండ : కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ సోమవారం వినుకొండ వచ్చిన సందర్భంగా అలనాటి స్నేహితులు అయిన జర్నలిస్టులు ఎం.గౌస్ మోహిద్దీన్, యార్లగడ్డ చంద్రశేఖర్ ఆజాద్ ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

9న సీపీఐ మండల మహాసభ

విశాలాంధ్ర-బొల్లాపల్లి: పల్నాడు జిల్లాలోని బొల్లాపల్లి మండల సీపీఐ మహాసభ ఈనెల తొమ్మిదవ తేదీ శనివారం మండల కేంద్రం బొల్లాపల్లిలో నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కార్యదర్శి పిన్నెబోయిన వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామంలోని మండల పరిషత్ ఆఫీసు ఎదు రుగా శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్, వినుకొండ నియోజకవర్గం సమితి కార్యదర్శి బూదాల శ్రీనివాసరా వుతో పాటు పలువురు నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ మహాసభలకు మండలంలోని అన్ని గ్రామాల నుండి పార్టీ సభ్యులు, సానుభూతిపరులు, యువకులు, విద్యార్థులు రైతులు, ప్రజలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

తహశీల్దార్ వెంకటస్వామి బాధ్యతలు

విశాలాంధ్ర-పెదనందిపాడు : పెదనందిపాడు తహశీల్దార్‌గా బి.వెంకటస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కాకుమాను మండలం నుంచి బదిలీపై పెదనందిపాడు మండలానికి వచ్చారు. శిక్షణ నిమిత్తం పెదనందిపాడులో గత ఆరు నెలలుగా తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న పి.శంకర్ బాబు తన మాతృసంస్థకు బదిలీ అయ్యారు. నూతన తహశీల్దార్ బి.వెంకటస్వామికి, ఉపతహశీల్దార్ షేక్ కరిముల్లా, కార్యాలయ సిబ్బంది ఘనస్వాగతం పలికారు.

నిర్ణీత వయస్సు వచ్చాకే వివాహాలు

విశాలాంధ్ర-తెనాలి : నిర్ణీత వయస్సు వచ్చాకే వివాహాలు నిర్వహించాలని ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ అన్నారు. కొత్తపేట పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో గల ఉపవైద్యఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో జరిగిన ఆషా డే కార్యక్రమాన్ని ఉపవైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ మంగళవారం సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పిల్లల్లో ప్రాథమిక దశలలో తీసుకోవలసిన జాగ్రత్త చర్యలు ఈ ఆశ యాప్స్, ఆశా రికార్డ్స్ నిర్వహణ, గర్భిణీ నిర్ధారణ పరీక్షల కిట్స్ వాడే విధానము అర్హులైన దంపతులతో చర్చించవలసిన తదితర అంశాలను గురించి వివరించారు. గుంటూరు రమేష్ హాస్పటల్ గైనకాలజిస్టు డాక్టర్ అనురాధ గర్భిణీ స్త్రీలలో ఉండే ప్రమాదకర లక్షణాలు వాటి గుర్తింపు తీసుకోవలసిన జాగ్రత్త చర్యలు ఏ సమయంలో ఆసుపత్రికి పంపవలెనో అన్న విషయాలను గురించి అవగాహన కలిగించారు. ఆరోగ్య విస్తరణాధికారి అండె బాల చంద్రమౌళి, గుంటూరు రమేష్ హాస్పిటల్ మేనేజర్ శివ సంతోష్, ఆరోగ్య పర్యవేక్షకులు పాగోలు వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కళలు, సాంస్కృతిక రంగాన్ని కాపాడుకోవాలి

విశాలాంధ్ర-అమరావతి: విదేశీ విషమ సంస్కృతిని విడనాడి, స్వదేశీ సాంప్రదాయ కళలను, సాంస్కృతిక రంగాన్ని కాపాడేం దుకు ప్రభుత్వం ఒక ప్రణాళికను రూపకల్పన చేయాలని ఆంధ్రప్ర దేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరా పట్నం రామకృష్ణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, శ్రీ సాయి నటరాజ నాట్యమండలి సారధ్యంలో పౌరాణిక జానపద సాంఘిక ఐదవ నాటక వార్షికోత్సవాలు మండల కేంద్రమైన అమరావతి లోనే సత్తెనపల్లి క్రాస్ రోడ్ వద్ద నిర్వహించారు. ప్రథమ సాంఘిక నాటకం భక్త చింతామణి నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి వర్ధమాన సినీ నటులు వల్ల చెన్నకేశవరావు మాట్లాడుతూ సినీ నటులు తెరపైన ఉంటే స్టేజి నాటక నటులు ప్రజల హృదయాల్లో ఉంటారని అన్నారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజాన్ని ఆలోచింపజేసే విధంగా ఉండాలంటే రాజరిక వ్యవస్థనుండి వస్తూ ఉన్న సాంస్కృతిక నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు బి.సూరిబాబు మాట్లాడుతూ మనిషి జీవన విధానంతో పాటు ఆరోగ్యవంతంగా సమాజాన్ని తీర్చిదిద్దాలంటే అది ఒక నాటక రంగానికి సాధ్యమని అన్నారు సమాజానికి వెలుగునిస్తూ చీకట్లో అలమటిస్తున్న నాటక రంగా కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి నాయకులు జాస్తి సత్యమూర్తి, సిహెచ్ ఉదయ శేఖర్, డాక్టర్ రామకృష్ణ, అమరావతి మండల సీపీఐ కార్యదర్శి కారంపూడి చెన్నకేశవ, బి నరసింహారెడ్డి పాల్గొనగా, పెదకూరపాడు నియోజకవర్గ ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు కార్యక్రమం అనంతరం నటులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని నిర్వాహకులు భైరాపట్నం రవికుమార్ పర్యవేక్షించారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రాష్ట్రంలో నిరాదరణకు గురవుతున్న గ్రంథాలయాల అభివృద్ధికి, మాతృభాషా వికాసానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు వెల్లడించారు. రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ప్రతినిధులు గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో ఉన్న సంస్థ కార్యాలయంలో ఛైర్మన్‌ను మంగళవారం కలిశారు. నగరంలో ఇటీవల రాష్ట్ర వ్యాపితంగా నిర్వహించిన కార్యక్రమాల్ని, రాష్ట్ర సదస్సు చేసిన తీర్మానాలను వేదిక కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా గోనుగుంట్ల మాట్లాడుతూ గ్రంథాలయాల్లో నూతన పుస్తకాలు కొనుగోలు, ఉద్యోగాల భర్తీ, విద్యా సంస్థల్లో గ్రంథాలయాల అభివృద్ధి వంటి వాటిపై కసరత్తు చేస్తున్నామని, సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే సమస్యల్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సాహిత్య సభలు, పుస్తక ఆవిష్కరణకు జిల్లా గ్రంథాలయాలు ఉచితంగా లేదా సాధారణ ఛార్జీలతో ఇచ్చేందుకు అదేశిస్తామని హామీ ఇచ్చారు. గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ ప్రతినిధులు చలపాక ప్రకాష్, పరుచూరి అజయ్ కుమార్, సీహెచ్ సుశీల, మోతుకూరి అరుణకుమార్, నానా, శ్రీవశిష్ట, ఎస్ఎమ్ సుభాని ఉన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్‌ను సత్కరించి గ్రంథాలయ ఉద్యమ పుస్తకాలు అందజేశారు.

షాదీఖానా అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

సుగాలి కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదీఖానా అభివృద్ధికి కృషి చేస్తానని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. మంగళవారం స్థానిక పట్టాభిపురంలోని షాదీఖానాను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు ఇస్లామిక్ కౌన్సిలింగ్ సెంటర్ ని మొత్తం పూర్తి చేయకుండానే హడావిడిగా ఎన్నికల ముందు ప్రారంభించుకున్నారన్నారు. దీని మొత్తాన్ని పరిశీలించి సుమారు 50 లక్షల రూపాయల పనులు చేయవలసి అవసరం ఉందని గుర్తించాము. వీటన్నిటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులను పూర్తి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. త్వరలో షాదీఖానా కమిటీ ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వర ప్రసాద్, టీడీపీ నాయకులు షేక్ అబ్దుల్ రహీం, లాల్ వజీర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సుగాలి కాలనీలో ఎమ్మెల్యే మాధవి, కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు తో కలిసి మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా బంజారా ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సుగాలి కాలనీ ప్రజలు తమకు బి ఫామ్ పట్టాలు కావాలని, అదేవిధంగా కమ్యూనిటీ హాల్ కావాలని కోరారు. సమస్యను పరిష్కరించటానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీనివ్వటం జరిగింది.

నగరాభివృద్ధిపై కూటమి ముద్ర ఉండేలా పనిచేయాలి : సీఎం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: రాష్ట్ర రాజధాని అమరావతిలో భాగమైన గుంటూరు నగరాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని, కూటమి ఆధ్వర్యంలో గుంటూరు నగరాభివృద్ధికి కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. నగర మేయర్ కోవెలమూడి రవీంద్రతో కలిసి కూటమి కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, నిమ్మల వెంకటరమణ, షేక్ మీరావలి ముఖ్యమంత్రిని ఉండవల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ నగర ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం తరపున అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

కళ్యాణ్‌ను అభినందించిన మేయర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : యూపీఎస్సీ సివిల్స్‌లో జాతీయ స్థాయిలో 146వ ర్యాంకు సాధించిన చల్లా పవన్ కళ్యాణ్‌ను తన ఛాంబర్‌లో మేయర్ కోవెలమూడి రవీంద్ర మంగళవారం శాలువా, బొకేతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరానికి చెందిన చల్లా పవన్ కళ్యాణ్ యూపీఎస్సీ సివిల్స్‌లో జాతీయ స్థాయిలో 146వ ర్యాంకు సాధించడం ఎంతో అభినందనీయమన్నారు. పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఉద్యోగులు నిత్యం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ఉంటారని, వారు కుల, మత, పార్టీలకతీతంగా పేద ప్రజలకు న్యాయం జరిగేలా పనిచేయాలన్నారు. నేటి యువత కళ్యాణ్‌ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చల్లా రమేష్, కసుకర్తి హనుమంతరావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

8వ శానిటరీ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యం, పారిశుధ్య పర్యవేక్షణ లోపంపై 8వ శానిటరీ డివిజన్ ఇన్‌స్పెక్టర్ పి.రాంబాబును విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5వ తేదీన తమ క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా 8వ శానిటరీ డివిజన్‌లో కార్మికుల హాజరు రిజిస్టర్‌లో ముగ్గురు కార్మికులు హాజరు నమోదు చేసి ఉండగా, సదరు కార్మికులు విధుల్లో లేకుండడం గుర్తించామన్నారు. సదరు డివిజన్‌లో పారిశుధ్య పనుల పర్యవేక్షణలో కూడా శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు నిర్లక్ష్యంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేసి, విధుల నుంచి సస్పెండ్ చేశామన్నారు.

సీహెచ్‌ఓల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి: వెలుగూరి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ ప్రొవైడర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం గుంటూరు కలెక్టర్ కార్యాలయం ముందు సీహెచ్‌ఓలు చేపట్టిన నిరవధిక ఆందోళనకు ఏఐటీయూసీ రాష్ట్ర నాయకత్వం పాల్గొని తమ సంపూర్ణ మద్దతు తెలిపింది. నిరవధిక సమ్మెలో భాగంగా గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద నుంచి నగరంపాలెం మీదుగా గుర్రం జాషువా విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ సీహెచ్‌ఓల న్యాయబద్ధమైన సమస్యల తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాన్ని తుంగలో తొక్కిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరు సంవత్సరాలు విధులు నిర్వహించిన అనంతరం రెగ్యులరైజ్ చేస్తామని రాతపూర్వకంగా ఉద్యోగస్తులకు హామీ ఇచ్చి నేడు దాన్ని అమలుపరచకుండగా వేధింపులకు గురి చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. తక్షణమే ఈపీఎఫ్‌ఓను పునరుద్ధరించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్, నగర అధ్యక్షులు రావుల అంజిబాబులు మాట్లాడుతూ బకాయిపడిన క్లినిక్ అద్దెలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలని, గుమస్తా ఉద్యోగం దగ్గర నుంచి ఐఏఎస్ కేడర్ వరకు జాబ్ చార్ట్ ఉంటుందని, కానీ జాబ్ చార్ట్ లేకుండా అన్ని రకాల విధులు నిర్వహించుకుంటూ శ్రమదోపిడి చేయడం తగదన్నారు. తక్షణమే జాబ్ చార్ట్‌ను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సీహెచ్‌ఓలు చేస్తున్న ఆందోళనలో పూర్తిగా భాగస్వామ్యం అవుతూ సమ్మె విజయవంతంలో కీలక పాత్ర పోషిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పల్లపాటి లింగరాజు, జిల్లా అధ్యక్షులు టి.ప్రవల్లిక, ఉపాధ్యక్షులు జి.వనజ, కోశాధికారి సంధ్య, చీఫ్ అడ్వైజర్ కోడాలి సృజన, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు, ఉపాధ్యాయులకు శిక్షా అవార్డ్స్ 2024-25 ప్రదానం చేసిన లీడ్ గ్రూప్

విశాలాంధ్ర-విజయవాడ: దేశంలోని ప్రముఖ స్కూల్ ఎడ్‌టెక్ సంస్థ అయిన లీడ్ గ్రూప్ ఆధ్వర్యంలో ఉత్తమ పాఠశాలలు, ఉపాధ్యాయులకు శిక్షా అవార్డ్స్ ప్రదానం చేసింది. హైదరాబాద్‌లో శిక్షా అవార్డ్స్ 2024%-%25 యొక్క మూడవ ఎడిషన్‌లో లీడ్ గ్రూప్ హెడ్ సుమీత్ మెహతా మాట్లాడుతూ దేశంలోని అతిపెద్ద పాఠశాల అవార్డు కార్యక్రమాలలో ఇందులో మొదటిదన్నారు. లీడ్ గ్రూప్ ద్వారా నిర్వహించబడే శిక్షా అవార్డ్స్, విద్యా శ్రేష్ఠత కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తూ, విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరుస్తున్న విద్య నిపుణులు ఉపాధ్యాయులను గుర్తించి, సన్మానించేందుకు ఉద్దేశించినాదన్నారు. ఈ పాఠశాలలు, స్థానం లేదా పరిమాణంతో సంబంధం లేకుండా, జాతీయ విద్యా విధానం (ఎన్ సి ఎఫ్)కు అనుగుణంగా, బహుముఖ బోధన-అభ్యాస పద్ధతులను తమ తరగతి గదులలో ఖచ్చితమైన ప్రణాళిక, శిక్షణ, పర్యవేక్షణ ద్వారా విజయవంతంగా అమలు చేశాయన్నారు. 2024-25 శిక్షా అవార్డ్స్‌లో 2900కు పైగా పాఠశాలలు 29,000కు పైగా ఉపాధ్యాయులు పాల్గొన్నారన్నారు. పాఠశాల అవార్డు విభాగాలలో జాతీయ విజేతలు, జోనల్ విజేతలు రాష్ట్ర విజేతలు ఉన్నారన్నారు. ఈ అవార్డుల కార్యక్రమం ద్వారా భారతదేశ వ్యాప్తంగా 3000కు పైగా పాఠశాల నిపుణులు విద్యావేత్తలను అవార్డులు గుర్తింపుతో సన్మానిస్తున్నామన్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో 27 పాఠశాలలు, తెలంగాణలో 28 పాఠశాలలు, తమిళనాడు మరియు కర్ణాటకలలో ఒక్కో రాష్ట్రంలో 7 పాఠశాలలు ఉన్నాయని చెప్పారు.

10 తీవ్రమైన కేసుల్లో 7 కేసుల్లో ఉబ్బసం తక్కువగా నిర్ధారణ అయింది

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): "అందరికీ పీల్చే చికిత్సను అందుబాటులోకి తీసుకురావడం" అనే (గ్లోబల్ ఇనిషియేటివ్ ఫర్ ఆస్తమా) థీమ్‌తో గుర్తించబడిన ఈ సంవత్సరం ప్రపంచ ఆస్తమా దినోత్సవం భారతదేశ ప్రజారోగ్య ప్రయాణంలో కీలకమైన సమయంలో వస్తుంది. డాక్టర్ గుత్తా లోకేష్, కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మోనాలజిస్ట్, విజయవాడ, ఇలా అన్నారు: "ఆస్తమా నిర్వహణ యొక్క ప్రాథమిక లక్ష్యాలు లక్షణాలను నియంత్రించడం, రెస్క్యూ మందులపై ఆధారపడటాన్ని తగ్గించడం, ఆసుపత్రిలో చేరకుండా నిరోధించడం ఊపిరితిత్తుల పనితీరును కాపాడటం - చివరికి జీవన నాణ్యతను మెరుగుపరచడం. ఈ ఫలితాలను సాధించడానికి సకాలంలో రోగ నిర్ధారణ, సరైన ఇన్హేలర్ వాడకం స్థిరమైన కట్టుబడి ఉండటం అవసరం.

సామ్‌సంగ్ నుంచి ప్రీమియం ఏఐ ఇంటిగ్రేటెడ్ క్యుఎల్ఈడి టివి సిరీస్, క్రిస్టల్ క్లియర్ 4కె యుహెచ్డి టీవీలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలోని అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, ఈ నెల 1 నుండి అమెజాన్, ఫ్లిప్ కార్ట్, సామ్‌సంగ్ డాట్ కాంలలో అందుబాటులో ఉన్న దాని కొత్త శ్రేణి ఏఐ ఆధారిత క్యుఎల్ఈడి టివి, క్రిస్టల్ క్లియర్ 4కె యుహెచ్డి టివిలను అందుబాటులో ఉంచినట్లు ప్రకటించింది. అత్యుత్తమ గృహ వినోద అనుభవాన్ని అందించడానికి రూపొందించబడిన కొత్త శ్రేణిలో క్యుఎల్ఈడి సిరీస్ - క్యుఈఎఫ్1, అత్యాధునిక ఏఐ సాంకేతికతతో అమర్చబడి ఉంటుంది. క్లియర్ 4కె యుహెచ్ డి టివి సిరీస్ - యుఈ81, యుఈ84, యుఈ86 ఉన్నాయి. అద్భుతమైన స్పష్టత, రంగు, సూక్ష్మ అంశాలను అందించడానికి రూపొందించబడింది. ఇది అద్భుతమైన రంగు ఖచ్చితత్వం, మన్నికను అందిస్తుంది.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆందోళన కార్యక్రమాలకు నెల 13 న అన్ని జిల్లాల్లో కలెక్టరేట్లు, డీపీటీవో కార్యాలయాల ముట్టడికి పిలుపు ఇస్తున్నట్లు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్ ఎంయూఎ) అధ్యక్షులు పి.వి. రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఏ.పి.పి.టి.డి)సెంట్రల్ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో అధ్యక్షులు రమణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంలో విలీనం అనంతరం ఆర్టీసీ ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన చేశారు. ఉన్నతాధికారులు ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను ప్రభుత్వం తక్షణం స్పందించాలని కోరుతూ ఈ నెల 13న అన్ని జిల్లాల్లో ఛలో డీపీటీవో కార్యక్రమం నిర్వహించా లని నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు ఆర్టీసీలో కొందరు ఉన్నతాధికారులు సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారు ఎన్నో సార్లు అధికారులను కలసి కోరినా స్పందించలేదు, సమస్యలు పరిష్కారం చేయడం లేదు అన్నారు. నాన్ ఫైనాన్షియల్ సమస్యలన్నీ పరిష్కరించాలని సీఎం చంద్రబాబు ఆర్టీసీ ఎండీ ని ఆదేశించారన్నారు. సమస్యలు పరిష్కరించాలని ఆరు నెలలుగా కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు, ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె వెళ్లాలని అధికారులు కోరుకుంటున్నారా అని ప్రశ్నించారు. మేము ప్రభుత్వ ఉద్యోగులమా, ఆర్టీసీ ఉద్యోగులమా అర్థం కావడం లేదు అన్నారు. 6 నెలలుగా సచివాలయంలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల కు సంబంధించి పలు దస్త్రాలకు మోక్షం లభించడం లేదు అన్నారు. ఆర్టీసీ సంఘాలతో ఆర్టీసీ యాజమాన్యం కనీసం చర్చించడం లేదు విద్యుత్ బస్సులను ఆర్టీసీ ద్వారానే నడపాలి కావాలని రెచ్చగొడితే తీవ్ర తరం చేసేందుకు వెనుకాడం అని హెచ్చరించారు. ఈనెల13న అన్ని జిల్లాల కలెక్టరేట్లు , డీపీటీవోలు ముట్టడి చేపడతాం దయచేసి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం సమస్యలు పరిష్కరించకుండా బలవంతంగా నెట్టితే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగుతాం అన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరాజు, కోశాధికారి పి.వి.వి.మోహన్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

పర్యావరణ ప్రాముఖ్యతపై చిత్ర లేఖన పోటీలు

విశాలాంధ్ర-తిరువూరు: రోజురోజుకు పెరుగుతున్న పర్యావరణ కాలుష్యం గురించి విద్యార్థులలో అవగాహన పెంచడానికి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు. పోటీల్లో 75మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలుగా నిల్చిన జోషిక, జశ్విత, తన్విలకు జ్ఞాన గౌతమ్ ట్యూషన్ నిర్వాహకులు డి.శ్రీనివాసరావు సౌజన్యంతో ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో జెవివి జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.హరికృష్ణ, నాయకులు ఎం. సుధాకర్, కె. పాపారావు, ఎస్. జగన్మోహన్ రావు, పి. వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

బేటి బచావో, ఆడపిల్లల భవిష్యత్తు పై అవగాహన

విశాలాంధ్ర-తిరువూరు: శాంతినగర్ ఏరియాలో మంగళవారం బేటి బచావో బేటి పడావో కౌమార బాలికల సాధికారతవైపు పయనం, ఆడపిల్లల అక్రమ రవాణా, మన భవిష్యత్తు మన లోనే ఉంటుంది కాబట్టి మనం క్రమశిక్షణతో మంచి నడవడికతో చదువుకుని ఉద్యోగాలు సంపాదించి ఉన్నత శిఖరాలు అధిరోహించే విధంగా మన ఆలోచనలు ఉండాలని వేరే విధంగా మన ఆలోచనలు పక్కదారికి పోకూడదని, ఇన్‌స్టాగ్రామ్ ,వాట్సప్ వంటి సోషల్ మీడియా యాప్స్ చాటింగ్ పట్ల ఆకర్షణకు గురికావద్దని వాటి వల్ల వచ్చే అనర్థాలు వివరిస్తూ అలాగే ఆడపిల్లలు పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్న సచివాలయ మహిళా పోలీస్ మల్లెల విజయలక్ష్మి అవగాహన కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ సుశీల, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మహీంద్రా డీలర్‌షిప్‌ను ఆవిష్కరించిన ఏఎంపీఎల్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలోని అతిపెద్ద ఆటోమొబైల్ రిటైల్ సంస్థలలో ఒకటైన ఆటోమోటివ్ మానుఫ్యాక్చరర్స్ ప్రైవేట్ లిమిటెడ్ విజయవాడలో మంగళవారం అతిపెద్ద మహీంద్రా డీలర్‌షిప్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి మహీంద్రా నుండి వీపీ - సేల్స్, కస్టమర్ కేర్ సీఎక్స్ పవన్ కుమార్, ప్రెసిడెంట్ అండ్ నేషనల్ సేల్స్ హెడ్ బనేశ్వర్ బెనర్జీ, ఇరు సంస్థల నుంచి ఇతర సీనియర్ ఆఫీసర్ హాజరయ్యారు. విజయవాడలోని ఏలూరు రోడ్డు, ఎనికెపాడులో వ్యూహాత్మకంగా ఉన్న ఈ ఆధునిక 3ఎస్ (సేల్స్, సర్వీస్, స్పేర్స్) సౌకర్యం 1.03 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. ఇందులో 14 వాహనాలను ఒకేసారి ప్రదర్శించగల విశాలమైన షోరూమ్ ఉంది. మహీంద్రా విస్తృత శ్రేణి వాహనాలు - ప్యాసింజర్ వెహికల్ (ఐసీఈ, ఈవీ), స్మాల్ కమర్షియల్ వెహికల్ (ఎస్‌సీవీ), లాస్ట్ మైల్ మొబిలిటీ (ఎల్ఎంఎం) అన్నీ ఒకే చోట లభిస్తాయి. ఈ కొత్త సౌకర్యం వాహన విక్రయాలు మరియు అమ్మకాల తర్వాత సేవలతో పాటు వాహన ఫాస్ట్-ఛార్జింగ్ సౌకర్యాన్ని అందించేలా రూపొందింది. ఆధునిక రంగుల సమ్మేళనం, ఆకర్షణీయమైన లైటింగ్, సహజమైన సాంకేతికతతో షోరూమ్‌లోని ప్రతి అంశం అభివృద్ధిపరమైన డిజైన్, ఆవిష్కరణ మరియు ఆకర్షించేవిధంగా రూపొందించారు. కస్టమర్లు ఈ కేంద్రంలో అడుగుపెట్టగానే కొత్త టెక్నాలజీలను ప్రత్యక్షంగా చూడగలుగుతారు. అనే ఎలక్ట్రిక్ వాహనాల ప్లాట్‌ఫారమ్, ప్రపంచంలో వేగంగా పనిచేసే అనే స్మార్ట్ సిస్టమ్, అలాగే హీరో ఫీచర్లు కూడా ఇందులో కనువిందు చేస్తాయి. ఇందులో 61 అధునాతన సర్వీస్ బేలు ఉన్నాయి. ఇవి సంవత్సరానికి సుమారు 28,000 మంది కస్టమర్లకు సులభంగా సేవలందించగలవు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు



విశాలాంధ్ర-తిరువూరు: గ్రంథాలయం లో వేసవి శిక్షణా తరగతుల్లో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం కన్వీనర్ డి.ప్రభాకర్ విద్యార్థులకు గ్రంథాలయం ఉపయోగాలు, మానవతా విలువలు గురించి విద్యార్థులకు వివరించారు జరిగింది. ఇలాంటి వేసవి శిక్షణ తరగతుల్లో శిక్షణ పొందిన విద్యార్థులు మెరుగైన భవిష్యత్తు కలుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. పిల్లలు ఈ వేసవికాలంలో మొబైల్ కి ల్యాప్టాప్ కి దూరంగా ఉండి పుస్తకాలకి ఆటలకి ప్రాధాన్యత ఇచ్చి వారి ఆరోగ్యాన్ని దోహదపడే విధంగా ఆటలు ఆడుతూ ఆలోచన అభ్యుదయం క్రమశిక్షణ కొరకు ఒక్కటే మార్గం పుస్తకాలను చదివితే సాధ్యమని అన్నారు. పిల్లల భావితరాల భవిష్యత్తు కోసం మేము చేసే చిన్న సేవ అంటూ సత్య సాయి సేవా సమితి వారి కి కృతజ్ఞతలు తెలిపారు.